అక్టోబరు 2020
రు. 20/-

# చైతన్యం

సంకల్ప బలం

## సామాజిక విలువల మాసపత్రిక



**పాఠకులకు**
**బతుకమ్మ,**
**దసరా పండుగ**
**శుభాకాంక్షలు**







# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**

సంపుటి -10 అక్టోబరు 2020 సంచిక - 1


## ఈ సంచికలో....


సంపాదకీయం 4

పదవ జన్మదిన శుభాకాంక్షలు 5

ఈ నెల వీడియోలు 10

తిన్నింటి వాసాలు 11

ప్రియ షడ్వర్గాలు 14

పూరీ జగన్నాథస్వామి వైభవం 16

సప్త మోక్ష నగరాలు 20

సినిమా 23

నూతన విద్యా విధానంపై అవగాహన 24

పదమూడవ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 27

గ్రీసు దేశపు పురాణ గాథలు 32

ప్రేమంటే ఇంతే 37

కారణ జన్ముడు గాన గంధర్వుడు బాలు 41

గడి-నుడి 43

తెలుగు పద్య రత్నాలు-18 45

బొట్టూ బొట్టూ కలిసి 47

మా ఊరి నందుల కథ 49



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

మన పాఠక దేవుళ్ళకు, రచయితలకు, రచయిత్రులకు ప్రత్యేక పండుగ శుభాకాంక్షలు. మన 'చైతన్యం సంకల్ప బలం పత్రిక' మీ అందరి ఆదరణతో 'తొమ్మిది వసంతాలు' పూర్తి చేసుకుని, 'పదవ వసంతం' లోకి అడుగు పెడు తోంది అంటే మీ అందరి ప్రోత్సాహమే కారణం. మీకందరికీ పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు.

బతుకమ్మ పండుగలని తెలంగాణాలో, దసరా నవరాత్రులని ఆంధ్రాలోనూ , అలాగే తిరుపతిలో బ్రహ్మోత్సవాలని ఎంతో వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు. ప్రతీ ఇంటిలోనూ పూజలూ, ప్రతీ గుడిలోనూ ప్రతేక అలంకరణలతో పూజ లు, దర్శనాలతో ప్రజలు ఎంతో హడావిడిగా ఉంటారు ఎప్పుడూ. కానీ ఈ కరోనా కాలంలో ఏ గుడికి వెళ్ళాలన్నా ప్రజలు భయపడుతున్నారు. ఎక్కడో కొందరు మాత్రమే ధైర్యం చేసి వెడుతున్నారు. కొన్ని గుళ్ళల్లో అయితే ప్రత్యేక సేవలలో దేవుడు ఏకాంతంగానే తన సేవలు చేయించుకుంటున్నాడు. అమ్మవారి గుళ్ళల్లో అయినా, అయ్యవారి గుళ్ళల్లో అయినా అంతే.

ఐదు దశాబ్దాలుగా సినీ సంగీత స్వర సామ్రాట్, ప్రపంచంలోని తెలుగు వారినే కాక, 16 భాష లలో పాడి, ఆ భాషల ప్రజలను కూడా తమ భాష గాయకుడే అని, పర భాష గాయకుడు పాడుతున్నాడనే బేధం లేకుండా, పాడి అందరి మనస్సులలోను ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న గాయకుడు శ్రీ బాల సుబ్రహ్మణ్యం. అటువంటి గొప్ప కళాకారుడు, కారణ జన్ముడు కీ.శే లుగా మారడం ప్రపంచానికే తీరని లోటు. వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబభ్యులకు తట్టుకునే ఆత్మ స్థైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటోంది "చైతన్యం సంకల్పబలం".

ఐదు దశాబ్దాలుగా కూచిపూడి డాన్స్ నే తన ప్రపంచంగా భావించి, దేశ విదేశాలలో కూచిపూడి డ్యాన్స్ చేసి, ఎన్నో ప్రోగ్రాములు ఇచ్చి, తెలుగు వారందరి మనస్సులలో స్థిరనివాసం ఏర్పరచుకున్న మహిళా కళాకారిణి పద్మశ్రీ శోభా-నాయుడు మనలను వీడి డ్యాన్స్ కళాకారులకే కాక, ప్రపంచంలోని తెలుగు వారందరినీ శోక సముద్రంలో ముంచె-త్తారు. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు ఇవ్వాలని "చైతన్యం సంకల్పబలం" కోరుకుంటోంది.

కరోనా మహమ్మారి కారణంగా దాదాపు అన్ని దేశాల ఆర్థిక స్థితి గతులు తారుమారయ్యాయని, కోవిడ్ నియంత్ర ణ దాని పరిణామాలను సమర్థవంతంగా నిర్వహించడంలో అమెరికా వైఫల్యం చైనాకు అనుకూలంగా మారబోతు న్నదనీ లేవీ ఇనిస్టిట్యూషన్ అంచనా వేసింది. బహుళ వాణిజ్య విధానంలో 'ట్రంప్' తీసుకున్న నిర్ణయాలు, పలు ఒప్పందాలు కూటమి నుంచి వైదొలగడానికి తోడు కరోనా ఎఫెక్ట్ వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ 2424కు కానీ గాడిన పడబోదు. అప్పటి లోగా చైనా మొదటి స్థానానికి చేరి ఏషియా పసిఫిక్ రీజియన్లో మోస్ట్ పవర్ఫుల్ దేశంగా నిలు-స్తుందని అధ్యయన సంస్థ తెలిపింది. కరోనా పుట్టుకకు కారణమంటూ తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న చైనా, మహమ్మారి సాగిన కాలంలో ఆర్థిక వ్యవస్థను కాపాడుకున్నా ఏకైక దేశంగా చైనాయే అని, మిగిలిన దేశాల ఎకానమీ పాతాళం వైపుకు, చైనా మాత్రం పైపైకి పయనించడం గమనార్హమని ఏజన్సీ పేర్కొంది.

ప్రజలపై వరుణ దేవుడికి వచ్చిన ఆగ్రహం అంతా ఇంతా కాదు.. అందులోనూ తెలుగు వారిపై, ఇంకా చెప్పా-లంటే తెలంగాణా ప్రజలపై వరుణుడు కన్నెర్ర జేశాడు. ఆ ధాటికి తట్టుకోలేక ప్రజలు ఆల్లాడి పోతున్నారు. ఇళ్ళల్లోకి నీరు జేరి, ఆర్థికంగానే కాక, ప్రాణ నష్టం కూడా జరిగింది. త్రాగడానికి నీరు, తిన డానికి తిండి లేక, ఉండడానికి కూడా నివాస యోగ్యం కాని ఇళ్ళతో ప్రజలు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. తెలంగాణాలో అయితే 100 సంవత్సరాలలో ఇటువంటి వర్షం చూడలేదని ప్రజల ఆవేదన. రోడ్ల మీద నీళ్ళు నిండి పోయి, కొన్ని చోట్ల అయితే పడవలు నడిపే పరిస్థితి ఏర్పడింది . . ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పట్టుకుని బతుకు వెళ్లదీసే పరిస్థితి ఏర్పడింది. హైదరాబాదు లోని లోతట్టు ప్రాంతాలలోని కొన్ని కాలనీలలోని ఇళ్ళు నీళ్ళల్లో మునగడమే కాక, ఇళ్ళ ముందర పడవలు నడిపే పరిస్థితి. వరదలతో ముంపుకు గురై ప్రజలు పడుతున్న ఇబ్బంది అంతా ఇంతా కాదు . . వరద నీటిలోనే ఉండి, త్రా-గడానికి నీళ్ళు, తినడానికి తిండీ లేక నానా ఇబ్బందీ పడుతున్నారు ప్రజలు. ప్రజల కష్టాలు ఎప్పుడు తీరుస్తాడో వరుణ దేముడు.ఈ కష్టాలకు తోడు కరోన కష్టాలు అయితే ఇక చెప్పనే అక్కర లేదు. ప్రపంచమంతా ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలు తీరి, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతీ ఒక్కరికీ 'విజయ దశమి, బతుకమ్మ' శుభాకాంక్షలు తెలుపుకుంటోంది మీ చైతన్యం సంకల్పబలం.

తీగవరపు శాంతి

# పదవ జన్మదిన శుభాకాంక్షలు

అభినందనలు,

నిరంతర సాహిత్యాలోచన, తత్ శ్రమగలవారిని చైతన్యవంతులుగా భావించవచ్చుననటానికి శ్రీమతి తెగవరపు శాంతి గారొక ప్రత్యేక నిదర్శనం. ఓర్మి, కూర్మి, సహనం, సంయమనం లాంటి సుగుణాలు అన్నియూ శ్రీమతి శాంతి గారిలో నిబిడీకృతమై నిత్య చైతన్యశీలిగా, సృజనాత్మకతకు చిరునామాగా ఆమె అందరి రచయితల సహకారంతో 'చైతన్యం సంకల్పబలం' మాసపత్రికను గత తొమ్మిది సంవత్సరములు చక్కగా ప్రచురిస్తూ, పాఠకుల మనస్సు ఆకట్టుకొన్నారు. ఇదే స్ఫూర్తితో, మీరు ముందుకు సాగాలని, వాంఛిస్తూ, పదవ సంవత్సరంలోనికి దిగ్విజయంగా ప్రవేశిస్తున్న శుభ తరుణాన మీకు, మీ సంపాదక వర్గ సభ్యులకు, ప్రింటర్స్ కు, మీ కుటుంబ సభ్యులకు, రచయితలకు, నా శుభాభినందనలు.

'చైతన్యం' పత్రిక మనందరి మనస్సు ఆకర్షిస్తుందనటంలో ఎట్టి సందేహం లేదు. వీరి కలం నుండి మరెన్నో పత్రికలు, రచనలు రావాలని ఆశిస్తున్నాను.

కె. రామానందం
విశ్రాంత బ్యాంక్ ఉన్నతోద్యోగి.





చైతన్యం రావాలంటే సంకల్పం ఉండాలి సంకల్పం కలగాలంటే చైతన్యం రావాలి
ఈ రెండు ఉండాలంటే బలం ఉండాలి అదే "సంకల్పబలం".
ఈ మాస పత్రిక సంకల్ప బలంతో మనకి చైతన్యం కలిగించి ప్రాచీన భావాలకు పట్టం కడుతూ నవీన భావాలకు అద్దం పడుతూ నిత్యనూతనంగా తొమ్మిది వసంతాలు ముగించి దశమ వార్షికోత్సవంలో అడుగు పెట్టింది. దశల వారీగా దిశానిర్దేశం చేసింది. తొమ్మిది అనే సంఖ్య చాలా బలమైనది విలువైనది

విఘ్నేశ్వరుని పూజించే నవరాత్రులు - 9 అమ్మవారి అలంకారాలు అవతారాలు - 9
నిత్యం సేవించే నవధాన్యాలు - 9 సంతోషంగా భుజించే నవకాయ పిండివంటలు - 9
ఆడంబరంగా ధరించే ఆభరణాలు నవరత్నాలు - 9 మానవ జీవితం లో అనుభవించే నవరసాలు - 9
అనుగ్రహ ప్రాప్తి కలిగించే నవగ్రహాలు - 9
వ్రతాలలో దైవానికి నివేదించే ప్రసాదాలు - 9



ఇన్ని విశేషాలు కూడుకున్న విశిష్టమైన విలువైన మన పుస్తకం.
తొమ్మిది వర్షాలు నిండిన అందమైన బాలిక లాగా ముస్తాబయింది.
తొమ్మిది వసంతాల ప్రాయంలో బాల బాలికలకి పరిపక్వత సిద్ధిస్తుంది.
అదే స్ఫూర్తి తో, యుక్తి తో, నవ చైతన్యం తో ధృడ సంకల్పంతో
సాగాలని. దసరా పండుగ సరదాలతో - విజయదశమి విజ-
యాలతో - జరుపుకోవాలని ఆశిస్తూ

అభినందనలతో రాజ్యశ్రీ పొత్తూరి

---

మనపత్రిక చైతన్యం సంకల్పబలం పదేళ్లుగా ఎగరేసిన శాంతిపావురం మానవతా విలువలతో మహనీ-
యుల మాటలతో నెలనెలా అలరించిన వ్యాసతోరణం
రాజకీయ సామాజిక కళా సంస్కృతీ విభవం
మానసిక వికాస వైద్య న్యాయ జ్యోతిషాకరం
తీర్థయాత్ర కథనాలు పర్వదిన విశేషాలు
ముఖాముఖీ పదకేళీ ప్రహేళికలు కవనాలు



ఎందరెందరో వరిష్ట రచనాక్రియ గరిష్టులు
మరెందరో వృత్తి నిపుణులైన వ్యాసకర్తలు
పదేళ్లుగా మనపత్రిక నిర్వహణా దక్షులు
తీగవరపు శాంతి దీక్ష క్రతువుకు ఋత్విక్కులు
అందరికీ వందనం అభినందన చందనం
దశవత్సర పర్వ వేళ శుభాభ్యుదయ వందనం
పాఠకులకు రచయితలకు నేపథ్య కృషివరులకు
మనపత్రిక చైతన్యం కృతజ్ఞతా వందనం

- తుమ్మూరి రాం మోహనరావు

## అభినందనలు తెలిపిన రచయిత్రులు, పాఠకులు





































స్థలాభావం వల్ల అందరి ఫోటోలు ముద్రించలేకపోతున్నందుకు క్షంతవ్యులం.

## గత తొమ్మిది సంవత్సరాలుగా పత్రిక ప్రగతిలో పాలుపంచుకున్న రచయిత(త్రు)లు

**2011 వ సంవత్సరం నుండి తేదీల వరుస క్రమంలో (In Chronological  Order)**

1) శ్రీ చాగంటి కోటేశ్వర శర్మ (ఆశీస్సులు)
2) శ్రీ ముదిగొండ శివప్రసాద్ (శుభాకాంక్షలు)
3) శ్రీమతి మంగళంపల్లి రాధా శ్రీహరి
4) డా. ద్వా.నా. శాస్త్రి
5) డా. పోచినపెద్ది వేంకట మురళీకృష్ణ
6) శ్రీ కరుణాకర్ చౌడవరపు
7) శ్రీమతి నండూరి సరోజాదేవి
8) శ్రీమతి జొన్నా రమణి
9) శ్రీమతి టి. దివ్య
10) కీ.శే. మంగళంపల్లి రామనరసింహమూర్తి
11) డా. ఎస్. కృష్ణమూర్తిశాస్త్రి
12) డా. వాసా ప్రభావతి
13) డా. తీగవరపు పూర్ణిమా స్రవంతి
14) శ్రీ కె. వి. శ్రీనివాస్
15) డా. జి. బాలసుబ్రహ్మణ్యం
16) శ్రీ వి. మధుసూదనరావు
17) శ్రీమతి సుందరవల్లి శ్రీదేవి
18) శ్రీ అంపేరాయని శేషు
19) శ్రీ కొత్త రామానందం
20) శ్రీమతి ఎన్. లక్ష్మి కర్లపాలెం
21) డా. శ్రీనివాస్
22) డా. కావూరి శ్రీనివాస్
23) శ్రీ ధరణీప్రగడ వేంకటేశ్వర శర్మ
24) శ్రీ అమరనాథ్ గురుస్వామి
25) శ్రీ తిరునగరి కృష్ణ
26) శ్రీ ముడుంబై వేంకటాచార్యులు



27) శ్రీ చిత్ర పురాణపండ
28) శ్రీ కోయిల్ కందాడై తిరుమలాచార్య
29) శ్రీమతి భారతీ శర్మ
30) ప్రో.ఎన్. రవిప్రకాష్
31) శ్రీ సన్నిధానం యజ్ఞనారాయణ మూర్తి
32) శ్రీ పురాణపండ కామేశ్వరరావు
33) డా. డి. వసంతకృష్ణ
34) డా. ఎస్ మనోహరన్
35) శ్రీ పేటేటి రత్న
36) శ్రీమతి లక్కరాజు వాణీసరోజిని
37) శ్రీమతి జి. విజయలక్ష్మి
38) శ్రీమతి ఎన్. వాణీ ప్రభాకరి
39) శ్రీ సిలువేరు సుదర్శన్
40) శ్రీమతి వాడపల్లి ఉష
41) శ్రీ మధుర కృష్ణమూర్తి శాస్త్రి
42) శ్రీ వి రాధాకృష్ణ శర్మ
43) శ్రీ డి.వి.హనుమంతరావు
44) శ్రీ ఆకొండి వేంకట సుబ్రహ్మణ్యశర్మ
45) శ్రీ బి. వేణుగోపాల్
45) శ్రీమతి ఎం సీతారత్నం
46) శ్రీమతి కాసుల లక్ష్మీ ఇందు
47) శ్రీమతి రాయప్రోలు భారతి
48)శ్రీ పోచినపెద్ది కామ సత్యనారాయణ
49) శ్రీమతి రేణుక
50) శ్రీమతి శనగవరపు లక్ష్మీశాస్త్రి
51) కీ.శే.  వి వి ఎస్ శర్మ

52) శ్రీమతి ఇంద్రగంటి లక్ష్మి
53) శ్రీమతి చాగంటి కృష్ణకుమారి
54) శ్రీ ఎం అప్పారావు
55) కీ శే కవన శర్మ
56) శ్రీమతి పి పద్మావతి
57) డా. పి డి వి సూర్యనారాయణ
58) శ్రీ గూడూరు గోపాలకృష్ణమూర్తి
59) శ్రీ అరిపిరాల నారాయణరావు
60) డా. ఎం కె
61) శ్రీ ఎం ఎస్ ఎం సింగ్
62) శ్రీమతి కె సత్యశారద లక్ష్మీ ప్రసన్న
63) శ్రీ ఎన్ సుబ్రహ్మణ్యం
64) శ్రీమతి లక్ష్మీ భాస్కర్
65) శ్రీ భువనచంద్ర
66) శ్రీమతి ఒబిలిశెట్టి నిర్మల
67) శ్రీమతి తాళ్ళూరి లక్ష్మి
68) శ్రీమతి టి జానకి
69) శ్రీ ప్రయాగ రంగశర్మ
70) శ్రీమతి స్వరాజ్యం వెంకటరమణమ్మ
71) శ్రీమతి కొచ్చెర్లకోట శ్రీలేఖ
72) శ్రీ చంద్రయ్య
73) శ్రీ పోడూరి శ్రీనివాసరావు
74) ప్రొ. పిల్లలమఱ్ఱి జనార్దనకృష్ణ
75) శ్రీమతి కె సీతామహాలక్ష్మి
76) శ్రీమతి పిల్లలమర్రి స్వర్ణసుందరి
77) శ్రీ సాగర్
78) శ్రీ విహారి
79) శ్రీ భైతి దుర్గయ్య
80) శ్రీ ఎస్ వేదుల
81) పి రుక్మిణీనాథ శాస్త్రి



82) శ్రీ గమిని రంగయ్య
83) డా. జి పద్మజ
84) శ్రీ వి సుభాష్
85) ఎలెక్ట్రాన్ (శ్రీ పింగళి రమణారావు)
86) శ్రీ రేలంగి కుమార శంకర గౌడ్
87) చుక్క వేణుగోపాల్
88) శ్రీ వేమూరి వేంకటేశ్వరరావు
89) శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి
90) వసుంధర
91) శ్రీ పాలెపు బుచ్చిరాజు
92) శ్రీమతి ఆదూరి హైమవతి
93) శ్రీ వేదుల సుబ్రహ్మణ్యం
94) శ్రీ జనార్దన ఠాకూర్
95) శ్రీ ముప్పాక తులసిదాస్
96) శ్రీ నందుల ప్రభాకర శాస్త్రి
97) శ్రీ చాగంటి శరత్ బాబు
98) శ్రీ చిలకమర్తి దుర్గాప్రసాదరావు
99) శ్రీమతి శకుంతల భట్
100) శ్రీ శ్రీకాంత్ గడ్డిపాటి
101) శ్రీ తుమ్మూరి రాంమోహన్ రావు
102) శ్రీ గుజ్జర్లమూడి కృపాచారి
103) శ్రీమతి పి సత్యవాణి
104) శ్రీ ఆర్ శర్మ దంతుర్తి
105) శ్రీ ఇంద్రకంటి వేంకట సుబ్బారావు
106) శ్రీ జి కె అనంత సురేశ్
107) డా. పింగళి గోపి
108) శ్రీ నేమాని సూర్యనారాయణ
109) శ్రీ పాలకుర్తి రామమూర్తి
110) శ్రీమతి జొన్నలగడ్డ సరస్వతి
111) శ్రీమతి పొత్తూరి రాజ్యశ్రీ

అందరికీ పేరు పేరునా హృదయాభివందనలు

## గడచిన 9 సంవత్సరాలలో పత్రిక సంపాదకురాలితో ముఖాముఖీలు నిర్వహించబడ్డ ప్రముఖులు. ( 2011 సంవత్సరం నుండి తేదీల క్రమంలో)

శ్రీ మురళీమోహన్ (Cine  Actor)
శ్రీ ప్రసాదరావు MD, RTC
శ్రీ ఎ.ఎల్.నితిన్ కుమార్ TV Producer
శ్రీ కనుమూరి బాపిరాజు ((Ex Minister)
Ms మహిత పామరాజు (సివిల్స్)
శ్రీమతి గీతా రెడ్డి
Ms షాహిన్ (TV9)
Ms సుధ (TV5)
Ms గోపిశెట్టి కీర్తి (TV5)
Ms జయ ( TV9)
Ms సంధ్యాభవాని (TV news reader)
Ms నర్మద News Reader
డా. కె. విజయ
శ్రీమతి వాణీ జయరాం
శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి
శ్రీ మంగళంపల్లి బాలమురళికృష్ణ
శ్రీ అనురాగ్ శర్మ IPS
శ్రీమతి జమున (Cine  Actor)
శ్రీ జయప్రకాష్ నారాయణ
శ్రీ శ్రీరాం (Indian Idol Winner)
శ్రీ రంగనాథ్ (Cine  Actor)
Ms కావ్య, Filght Test Engineer, USA
శ్రీ వంగూరి చిట్టెంరాజు USA
శ్రీ పి హరీష్ Indian Consul General(Houston)
శ్రీ తోటకూర ప్రసాద్ (Ex TANA President)
శ్రీ నూకల చినసత్యనారాయణ
శ్రీ సి రామచంద్రయ్య (Ex Minister)
శ్రీ రాజ నరసింహ (Ex Dy CM)
డా. అనంతలక్ష్మి
శ్రీ అశోక్ బాబు (NGO Leader)
శ్రీమతి కె కవిత (Ex M.P.)
Ms దివ్య, Duke University , USA
శ్రీమతి నూకల భానుశ్రీ (TV Artist)
శ్రీ నిమ్మకాయల చినరాజప్ప (Ex Home Minister)
శ్రీ భువనచంద్ర



## ఈ నెల విడియోలు



శ్రీ మురళి మోహన్

శ్రీ భువన చంద్ర

# తిన్నింటి వాసాలు



## ఎలెక్ట్రాన్

చదువులు పూర్తయ్యాయి. వెంటనే ఓ కేంద్రప్రభుత్వాధీన సంస్థలో ఉద్యోగం దొరికింది. శాస్త్ర సాంకేతిక విభాగంలో ఉద్యోగమది. ఆ సంస్థ కుడా మొదలై కేవలం మూడు సంవత్సరాలు. కేంద్ర అధికార యంత్రాంగం ఉత్తరాదిలోనూ, సాంకేతిక కార్యాచరణ స్థావరాలు మొదటగా పశ్చిమంలోనూ, ఈశాన్యంలోనూ స్థాపించబడ్డాయి. శాస్త్ర,సాంకేతిక విభాగంలో కూడా పలు శాఖలుంటాయి. కేంద్ర స్థావరంలో చేరిన నాలుగో రోజునే వివిధ శాఖల్లో చేరిన ఓ నలుగుర్ని ఈశాన్య స్థావరంలో పడేశారు. మేము రైలు రిజర్వేషన్లు అవీ చూసుకొని, కేంద్ర స్థావరంలో రైలెక్కి ఈశాన్య స్థావరం చేరడానికి మూడు-రోజులు పట్టింది. సుదీర్ఘమైన ప్రయాణం.

బ్రహ్మపుత్రానది మీద వంతెన నిర్మాణంలో ఉన్న సమయం. ఇవతల గట్టున అమీన్ గాఫ్లో రైలు దిగి, స్టీమర్ మీద బ్రహ్మపుత్ర దాటి, అవతలిగట్టున పాండులో( గౌహతి పొలిమేర స్టేషను) మళ్ళీ రైలెక్కితే, మరో 18 గంటల ప్రయాణం తర్వాత మా ఈశాన్య స్థావరాన్ని చేరుకోగలిగాం.

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నేను చదువుకొంటూన్నప్పుడు నాకు ఒక ఏడాది జూనియర్ అయిన బోర్థాకుర్ ఓ అస్సామీ విద్యార్థి. అతను తరచూ నా గదికి వస్తూండేవాడు. అతని కజిన్ అపూర్వజీబన్ బోర్థాకూర్ అక్కడి మా స్థావరంలో పాలనా విభాగంలో పనిచేసేవాడు. ఓ నలుగురు కోసం ఏదైనా ఇల్లు చూడమని విశాఖ నుంచి టేలిగ్రామ్ ఇచ్చాడు. అప్పటికింకా అధికశాతం పూరిగడ్డితో కానీ, రేకుల కప్పులతో కానీ ఉన్న ఇళ్లే అధికం. పక్కా కట్టడాలు బహు స్వల్పం.

భూకంపాల భయంవల్ల అక్కడవన్నీ తేలిక నిర్మాణాలు. రెండో అంతస్తనేది ఎక్కడోకాని కనిపించేది కాదు. మేము వెళ్ళేసరికే అతను ఓ యింటిని కుదిర్చేశాడు. మొత్తం మూడు గదులు. వంటకని వేరే ఒక చిన్న పూరిపాక గది. రాణా అనే ఓ ఘూర్కానీ వంటవాడిగా కుదిర్చాడు. మేము ఇద్దరిద్దరం ఒక గదిలో ఇమిడిపోయి, మూడో గదిని తిండికీ, రాణా వసతికీ కేటాయించేశాం.

మావన్నీ ఫీల్డ్ ఉద్యోగాలు. మూడు దఫాలుగా ఎనిమిదేసి గంటలు రాత్రింబవళ్ళు పనిచేయాలి.

నలుగురం నాలుగు రాష్ట్రాలనుంచి వచ్చినా, అందరం శాకాహారులమే కాబట్టి గొడవలేకపోయింది కానీ, రాణా మట్టుకు కొద్దిగా నిరాశ పడ్డాడు. ఎప్పుడైనా కావలిస్తే బయటకి పోయి తిని రావొచ్చునని హామీ యివ్వడంతో కుదుట బడ్డాడు.

ఏమైతేనేం రెండేళ్లలో స్థావర కార్యక్రమాలు వృద్ధిచెందాయి. రెండు ముడిచమురు క్షేత్రాల్ని కనుక్కోవడం జరిగింది. సమాచార వ్యవస్థ పుంజుకో సాగింది. కాలనీ నిర్మాణానికి నాంది పడింది.

రాణా మా అధ్వర్యంలో మా మా నాలుగు రాష్ట్రాల వంటకాల్ని వండే నైపుణ్యం సాధించాడు. ఒక నిర్ణీతమైన పద్ధతిలో వంటలు చేసేవాడు. బట్టలు ఉతికి, ఆరేసి, ఇస్త్రీ చేసేవాడు. పక్కలు సద్దేవాడు. వాచీలు పర్సులూ బయటపడేసి ఉన్నా తీసి, జాగ్రత్త చేసి, తర్వాత ఇస్తూ మందలించేవాడు. వస్తువు కనబడకపోతే తన మీద అనుమానపు కన్ను వెయ్యడం తన కిష్టంలేదని మొహం మీదే చెప్పేసేవాడు. జీతం పెంచాం. తనకి జీతం అందగానే మా చేత మనియార్డరు ఫారం భర్తీ చేయించుకొని, నేపాల్ లో ఉన్న తల్లిదండ్రులకి డబ్బు పంపే వాడు.

ఒకరోజున కేంద్ర స్థావరంనుంచి

మా స్థాయి ఆఫీసరే ఒకడు కంపెనీ పనిమీద వచ్చాడు.

అతగాడికి మా సహవాసుల్లో ఒకరైన మధుసూదన్ సహాధ్యాయుడు. అతని పేరు నందకుమార్.

అతను సంస్థ తాలూకు తాత్కాలికమైన అద్దెకొంప అతిథిగృహంలో ఖాళీ లేక, మాతో ఉన్నాడు. ఓ నాలుగు రోజుల తర్వాత పని పూర్తిచేసుకొని నందకుమార్ మా నలుగురికీ ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయాడు. ఓ నెల తర్వాత రాణా తనకి స్థానికులతో గొడవలు వస్తున్నాయనీ, అప్పటికే రెండు సార్లు చిన్నపాటి దెబ్బలు తిన్నాడని చెప్పుకొని, ఎంతచెప్పినా వినిపించుకోక నేపాల్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఓ స్థానికుణ్ణి కుదుర్చుకొన్నాము.

చదువు పూర్తయి ఉద్యోగం వచ్చిన తర్వాత, తల్లిదండ్రులు కుమారరత్నాల మీద వివాహపు ఒత్తిళ్ళు తీసుకురావడం మనదేశంలో సహజమే కదా?వాళ్ళ భయాలు వాళ్లవి. కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, అవునూ, కాదూ అని చెప్పే నిర్ణయం విజ్ఞత గల కుమార రత్నాలదే. ఆ బ్రహ్మచారుల వసతిలో బదిలీలమీద వెళ్ళినవారు, వెళ్లారు. కొత్తగా వచ్చినవారు దిగారు. పెళ్లిళ్లు చేసుకొని వేరు కొంపలు తీసుకొనో, లేదా కాలనీలో పరిమితంగా కట్టిన వసతుల్లోకి మారడమో జరిగేది. సరే ఓ సారి యింటికి సెలవు మీద వెళ్లినప్పుడు, అందరూ అప్పటికప్పుడు ఓ అమ్మాయిని చూసి, పెళ్లి చేసి పంపించేశారు. వాళ్ల భయం తీరింది. నా వయసు ఊపిరి తీసుకొంది. కాలనీలోకి మారాను.

మా సంస్థ ముడిచమురు క్షేత్రాలు పశ్చిమ ఈశాన్యరాష్ట్రాలలో ఒక్కటొక్కటిగా పెరిగాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పుంజుకొని, సమాచార వ్యవస్థ ఊహాతీతంగా మారిపోవడంతో సంస్థ సంస్కృతి మారిపోయింది. ఒకటా, రెండా యిరవై సంవత్సరాలుగా సంస్థ ఎదిగింది. సంస్థతోబాటు మేమూ ఎదిగాం. నాకూ అప్పటికి నాలుగు స్థావరాలికి బదిలీ అయింది.

నాకు బదిలీ అయిన అయిదో స్థావరం ముంబయ్. వెళ్ళి బాంద్రాలోని మా సంస్థ కాలనీలో ఒక బహుళ అంతస్తుల భవనంలోని ఒకవసతిలో దిగాను. ఓ ఆదివారం కూరల మార్కెట్ కి వెళ్లినప్పుడు, అక్కడ ఓ నేపాలీ నాకేసి చూడసాగాడు. నాకూ ఎక్కడో చూసిన మనిషిలాగే అనిపించి, ఒక నిముషంలోనే రాణా అని గుర్తించాను.

“ఏం రాణా? నన్ను గుర్తించావా? ఇక్కడేం చేస్తున్నావ్?” అని అడిగాను.

“గిరీష్ సాబ్! నేను మిమ్మల్ని చూస్తూనే గుర్తుపట్టాను. మీ దగ్గర దాపరికమెందుకు? ఆనాడు మధుసూధన్ సాబ్ అతిథిగా వచ్చిన నందకుమార్ సాబ్ నన్ను ఎక్కువ జీతంతో ప్రలోభపెట్టడంతో, మీ దగ్గర పని వదిలి, ఆయన పంచన చేరాను. ఆయనకీ నాలుగు బదిలీలు అయ్యాయి. ఆయనతో బాటే తిరిగాను. ఆయనా ఇక్కడే ఉన్నారు. ముగ్గురు సంతానం. అమ్మకూడా ఉద్యోగం చేస్తోంది. కూరలకోసం, చికెన్ కోసం వచ్చాను.” అన్నాడు.

“కాలనీలో నందకుమార్ సాబ్ క్వార్టర్ నెంబరు తెలుసా?”

“లేదుసార్! ఆయన ఈ ఊరు బదిలీ మీద వచ్చిన రెండేళ్లలో ఓ ప్రయివేట్ కంపెనీలో చాలా ఎక్కువ జీతంతో చేరిపోయారు. ఆ కంపెనీ కూడా మీ సంస్థచేసే పనే చేస్తుంది. మెహబూబ్ స్టూడియోస్ దగ్గర కుందన్ అపార్ట్మెంట్స్ లో ఉంటున్నారు. మీరు వచ్చారని చెప్పనా?”

“వద్దు. ఆ నాలుగు రోజుల పరిచయం తప్ప, అంతకు మించిన దోస్తీ లేదు. అందునా మా విభాగాలు వేరు. నేను అతన్ని చూడ్డానికి వెళ్ళినా, నిన్ను మా దగ్గరనుంచి ఎత్తుకుపోయిన తను ఇబ్బందిలో పడ్తాడేమో? అతను మా కంపెనీకి ఎదో పని మీద రాక తప్పదు. అప్పుడు అనుకోకుండా కలుసుకొన్నా నీ ప్రస్తావన తీసుకురానులే! మరి నీ సంసారం సంగతి?” అన్నాను.

“నాకు ఇద్దరు కుర్రాళ్ళు సాబ్. కుమార సాబ్ కంపెనీ సర్వెంట్ క్వార్టర్స్ మోహబూబ్ స్టూడియో దగ్గర్లోనే ఉన్నాయి, ఇబ్బంది లేదు.” రాణా సెలవు తీసుకొని వెళ్లిపోయాడు. మరుచటి శనివారం ఉదయం ఏడింటికల్లా, ఏదో అలవాటైన నిత్యపూజా కార్యక్రమం కొనసాగిద్దామని కూర్చోబోతుండగా సెల్ మోగింది. ఎవరికేం అవసరమొచ్చిందేమోనని చూశాను. నాకు పరిచయం లేని నెంబరు.

"గిరీష్ సాబ్ తో మాట్లాడాలి," అవతలి కంఠం పలికింది. ఆడ-గొంతుక.

"ఎస్! నేనే! చెప్పండి," అన్నాను.

"సర్! నా పేరు సమతామల్హోత్రా. సాగర్ ఎక్స్ ప్లోరేషన్ అండ్ ఎనర్జీ సంస్థ మానవ వనరులశాఖ నిర్దేశికురాల్ని. ఇంత ఉదయమే మిమ్మల్ని ఇబ్బందికి గురిచేస్తూ పలకరిస్తోన్నందుకు క్షమించాలి. మీరు అనుభవశాలురనీ, ప్రజ్ఞావంతులనీ మావద్ద తగినంత సమాచారముంది. మా యాజమాన్యం మిమ్మల్ని మా సంస్థలోకి తీసుకోవాలన్న కుతూహలంతో ఉంది. ఏడాదికి 30 లక్షల పేకేజీ. ఫార్మల్ అప్లికేషన్ మీకు కొరియర్లో పంపడం జరిగింది. అందులో వివరాలన్నీ ఉన్నాయి. కేవలం మీరు సంతకం పెట్టేసి పంపిచేస్తే మిగతా సంగతులన్నీ మేము చూసుకొంటాం."

నేను ఒక్కక్షణం తొట్రుపాటు పడి, తేరుకొని, తిరిగి సమాధానం చెప్పేలోగానే ఆమె సెల్ ఆపుచేసింది. అన్యమనస్కంగా పూజముగించాను. పూజయిన తర్వాత శ్రీమతి అడిగింది."ఎవరూ, ఫోన్ చేస్తే?" అనకూడదుకాని ఈ ఇల్లాళ్ళకి సెలవు పూటల్లో భర్తల సెల్ ఫోన్లు మోగితే ముందే ప్రణాళికలు వేసుకొన్న కార్యక్రమాలు అటకెక్కిపోతాయేమోనన్న భయం. మా సంస్థ కార్యకలాపాలన్నీ తరచూ అటువంటి పరిస్థితుల్ని కల్పిస్తోనే ఉంటాయి. "ఏమీ లేదు! ప్రోజెక్ట్ సైట్ నుంచి పని సరిగానే జరిగిపోయిందన్న రిపోర్ట్." అసలు సంగతి ఏ మాత్రం చెప్పినా నాకు సుఖశాంతులుండవు.

ఇప్పటికే మా సంస్థ మాకు చాలా అన్యాయం చేసిందనీ, ప్రైవేటు కంపెనీ వాళ్ళ జీతాలూ, సౌకర్యాలూ మనకుండవనీ అనే మహిళాసంఘ సభ్యుల మాటలు మాకు వినిపిస్తోనే ఉంటాయి. మా స్థాయి చూసి మాకంటే వాళ్ళకే బాధలెక్కువ!

అయినా ఎవరో రాలుగాయి మనిషి పరాచికాలు చేస్తోందేమోనని అనిపించింది. మహానగరాల్లో ఇటువంటి సంఘటనలు సాధారణంగా జరుగుతోనే ఉంటాయి. ఆ మధ్యాహ్నం మా ఇంటికి కొరియర్ వచ్చింది. కవరు చింపి కాయితాలు చూశా ను. వివరాలు ఆమె చెప్పిన విధంగానే ఉన్నాయి.

మంచి వసతి. ప్రత్యేకించి డ్రైవరుతో సహా కారు. విమాన ప్రయాణాలు. రెండేళ్ళకోసారి వారం రోజులు కుటుంబంతో సహా విదేశీ విహారయాత్రలు. ఇలా ఎన్నో సౌకర్యాలు. చివర్నఓ అనుబంధం లో అంతవరకు మా మాతృసంస్థనుంచి తమసంస్థలో జేరిన ఆఫీసర్ల వివారాలు ఉన్నాయి. వారిలో కొందరు నాకు తెలుసు. వారిలో మధుసూదన్ కూడా ఒకడని జాబితా చూసిన తర్వాత గ్రహించాను. ఆలోచనలో పడ్డాను. దేశవ్యాప్తంగా చాలా ముఖ్యమైన ప్రభుత్వాధీన సంస్థల్ని పెట్టుబడిదారుల సంస్థలకి అప్పగించే ఆలోచనని ప్రభుత్వం చేస్తోంది. దానికి సత్యాదూరాలు కాని కారణాలనేకం. చెప్పుకుంటే చేటలు నిండుతాయి. కానీ ఇక్కడ ఒక సంస్థ శైశవదశలో ఉండగా నేను చేరాను. నేను ఎదిగాను. సంస్థ ఎదిగింది. సంస్థతోబాటు తిరిగి నేనూ ఎదిగాను. ఇదొక నిరంతర ప్రక్రియ. ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని స్థిరపరచి, వ్యవస్థీకరించడంలో నేను చేసిన కృషి నాకు తెలుసు. ప్రభుత్వాధీన సంస్థకాబట్టి జీతభత్యాల విషయంలో కొన్ని నిబంధనలు యజమాన్యం పాటించక తప్ప దు. అంచెలంచెలుగా అవగతమైన మా సంస్థ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్నీ, నా ఇరవైఏళ్ల అనుభవాన్నీ, వాళ్ళు ఒక్క అంగలో సాధించే ప్రయత్నం సబువు కాదనిపించింది.

రాణాని హైజాక్ చేసిన మధుసూదన్ కీ, నాలాంటి వాళ్లని హైజాక్ చేయ ప్రయత్నిస్తోన్న సాగర్ సంస్థ వాళ్ళకీ ఏమి తేడాలేదు. ప్రభుత్వ విద్యాసంస్థలనుంచి సమర్థవంతులైన ఉపాధ్యాయుల్నీ, ఉపన్యాసకుల్నీ ప్రైవేటు విద్యాసంస్థలు ఆకర్షించే తీరుకీ, దీనికీ ఏమీ తేడాలేదు.

ఆ కాయితాల్ని చింపి చెత్తబుట్టలో పడేశాను. సాయంత్రం ఆరింటికి సమతా మల్హోత్రా ఫోన్ చేసింది ఫార్మల్ అప్లికేషన్ అందిందా అంటూ. "అందడం, చింపి బుట్టలో పారేయడం జరిగింది. ఈ విషయానికి మీరు ఇంతటితో స్వస్తి పలికితే సంతోషిస్తాను!" అని సెల్ మూశాను. తిన్నయింటి వాసాలు లెక్కబెట్టే స్థితికి నేనింకా జారిపోలేదు.

# ప్రియషడ్వర్గాలు



## భువనచంద్ర

ఇటుకరాయి పాలెంలో ఓ మహా భక్తుడున్నాడని వినగానే, రెండు రాష్ట్రాల నలుమూలల నుంచీ జనాలు తండోప తండాలుగా వచ్చి పడ్డారు. అప్పటికప్పుడు అన్ని రకాల అంగళ్ళు వెలిశాయి. టీ స్టాళ్లు, పిల్లల ఆటవస్తువులు షాపులు, టిఫిన్ సెంటర్లూ, ఆఖరికి నులక మంచాలు, అద్దె కిచ్చే షామియానా హౌస్ లతో సహా ఇటుకరాయి పాలెం సర్వాంగ సుందరంగా తయారయింది.

"అబ్బ.. ఆయన తేజస్సే తేజస్సు" భక్తిగా అన్నది అనసూయమ్మ. ఆవిడే కొడుకూ కోడల్ని బలవంతంగా తెచ్చింది. "నాకేమీ అనిపించలేదు" నిర్లిప్తంగా అన్నది కోడలు నీరజ.

"మనిషికన్నా కాస్త భయం భక్తీ ఉండాలి" నిట్టూర్చింది అనసూయమ్మ.

"అవును. కాస్త 'కలాపోసన' కూడా ఉండాలి ..." యీసడించింది నీరజ.

"అబ్బబ్బ ఇక్కడైనా ఆపుతారా మీ వాదాలు" విసుక్కున్నాడు నీరజ భర్త, అనసూయమ్మ కొడుకూ అయిన శివన్నారాయణ.

*******

నిన్న ఆయన ధ్రువుడు గురించి ఉపన్యాసం ఇచ్చాడు చూడూ ...ఓహ్ మైమరపుతో అన్నాడు శాస్త్రి.

"పూర్వాశ్రమంలో ఆయన తెలుగు లెక్చరరుట. సమాచారం అందిచ్చాడు అవధాని.

"వృత్తి కాదోయ్ అవధానీ, ప్రవృత్తి ముఖ్యం" నశ్యం పట్టు పడుతూ అన్నాడు మంగినాయుడు.

ఇలాంటివాళ్ళు ఉండబట్టే ధర్మం ఒంటికాలి మీదైనా నడుస్తోంది. లేకపోతే కలికాలపు ఆఘాయిత్యాన్ని భరించగలుగుదుమాంత!" రకాయించాడు ఓ దారే పోయే వెంగళరావు.

"అవునవును!" వంతపాడాడు అప్పారావు.

"అవునూ... యీయన మహా-భక్తుడని కదా ప్రచారం జరిగిందీ.. అసలు ఇతనిదే వూరూ? ఏ దేవుడి భక్తుడూ? ఉపాసకుడా, దీక్షాపరుడా లేక సాధకుడా?" వివరాలడిగారో వేంకటాచార్యులు.

"అవన్నీ నాకు తెలీవు కానీ, ఆయన ఈ వూరు వచ్చి మూడు నెలలయింది. ఎవర్నీ ఏదీ అడగడు. ఊరిచివర వున్న ఆంజనేయస్వామి గుడి దగ్గరే ఉంటాడు. స్నానపానాలు అక్కడున్న చెరువు దగ్గర, గుడిలో వున్న బావి దగ్గరా. ఆ గుడికి పూజారంటూ ఎవరూ లేరు కదా. ఈయనే సింధూరమూ నువ్వులనూనే తెచ్చి కలిపి, స్వామివారికి ఒంటినిండా పూశారు. దాంతో 'కళ' వచ్చింది. అది పేరుకే గుడి కానీ, సిసలైన గుడి కాదుకదా. అక్కడే నాలుగు తాటాకుల్తో పందిరి వేసుకుని వుంటున్నాడు. ఈయన వచ్చాకే నలుగురో అయిదుగురో భక్తులు ఆ గుడిలో స్వామిని దర్శించడం మొదలెట్టారు. మంచిగా వుంటాడు... మంచి విషయాలు చెబుతాడు. ఆ ప్రసంగం సమయంలో తప్ప మిగతా సమయాల్లో మౌనంగా వుంటాడు' తెలిసిన విషయాలన్నిటినీ పూసా గుచ్చాడు ఉపాధ్యాయుల శ్రీనివాసశర్మ. శర్మ మంచి ఉత్సాహి. ఎవరికే పని ఉన్నా చిటికెలో చెయ్యగల, చేయించగల సమర్థుడు. ఆ వూరే కాదు, ఆ జిల్లాలో ఏ వూరి గురించైనా సంపూర్ణ సమాచారం ఇవ్వగల నడిచే గ్రంథాలయం శర్మ.

"మరి భోజనం సంగతీ?" అడిగాడు వేంకటాచార్యులు.

"వొండుకోవటం చూళ్ళేదు. గుడికొచ్చే వాళ్ళు ఏమన్నా పళ్ళూ ఫలాలు ఇస్తే మాత్రం కొద్దిగా తీసుకుంటారని విన్నాను" చెప్పాడు శర్మ.

అయితే యివాళ తీరిగ్గా వెళ్లి చూడాల్సిందే.. మాట్లాడాల్సిందే!" తన నిర్ణయాన్ని పక్కనే నడుస్తున్న మిత్రులతో అన్నాడు వేంకటా-

చార్యులు.

"అదేం భాగ్యం. ఆరింటికి నేనుకూడా వస్తా లెండి" మోటార్ సైకిల్ స్టార్ట్ చేస్తూ అన్నాడు శర్మ. వాళ్ళిద్దరికీ జస్ట్ అప్పుడే పరిచయమయ్యింది. ఒకరి పేరు మరొకరికి తెలీదు. శర్మకి ఉన్న ప్రజ్ఞ అదే. ఎవరితోనైనా ఇట్టే కలిసిపోతాడు.

"మాస్టారూ నా పేరు వేంకటాచార్యులు. మిమ్మల్ని చూడ్డాన్కి గుంటూరు నుంచి వచ్చాను" పరిచయం చేసుకుంటూ అన్నాడు వేంకటాచార్యులు.

"అనవసరమైన శ్రమ తీసుకున్నారు. నాలాంటివాడ్ని కలిసి మీరు పొందబోయేది ఏముం - టుందీ!? నిర్లిప్తంగా అన్నాడాయన.

"మీరు మహా భక్తులని విన్నాను. ఇక్కడకు వచ్చినవారందరూ మిమ్మల్ని దర్శించుకోవడానికే" బాసింపట్టు వేసుకుని నేలమీద విశ్రాంతిగా కూర్చుని అన్నాడు వేంకటాచార్యులు.

"ఆమాట పుట్టించింది ఎవరో నాకు తెలీదు. అయినా భక్తుడు, మహాభక్తుడు, వీరభక్తుడు, ఉపాసకుడు ఇలాంటి పదాలన్నీ డిగ్రీలు కావు... పేరు పక్కన తగిలించడానికి. బిరుదులూ అంతకన్నా కావు" మరింత న్నిర్లిప్తతతో అన్నారాయన.

"ఔను స్వామీజీ... అయినా, ఇంతమంది మీకోసం వస్తున్నారు. ఇవ్వాళా రేపూ ఎవరు ఏం చెప్పినా, 'నువ్వేవరోయ్ మాకు చెప్పడానికీ' అని అడిగే సమాజంలో, మీరు చెప్పేది వినడానికి సొంత ఖర్చులతో ఇంత దూరం రావడం నిజంగా ఓ గొప్ప విషయమే కదా! వచ్చినవారికి నాలుగు మంచిమాటలు చెబితే, లబ్ధి పొందేవాళ్ళు పొందుతారు, లేనివాళ్ళు వాళ్లదారిన వాళ్ళు పోతారు" అర్ధవంతంగా నచ్చచెప్పాడు శ్రీనివాసశర్మ.

'మీరన్నదీ నిజమే. కానీ, నా దగ్గర చెప్పడానికి ఏమీ లేదు" మెల్లగా అన్నాడాయన.

"మంచిది. మీ విశ్రాంతి భంగం చెయ్యడం మాకు మర్యాదాకరమైన విషయం కాదు. వచ్చాం గనక, ఒకే ఒక్క ప్రశ్నని అడుగుతా. యీ జీవితం అంటే ఏమిటి? మీకు ఇష్టమైతేనే జవాబివ్వండి. ఇవ్వకపోయినా ఏమీ అనుకోను. అందరం జీవిస్తున్నవాళ్ళమే. ఒక్కొక్కరి జీవితానికీ ఒక్కో అర్ధం ఒక్కో గమ్యం స్ఫురిస్తుంది. మీకు తోచిన జవాబు మీరివ్వండి" సూటిగా అడిగాడు వేంకటాచార్యులు. సన్నగా నిట్టూర్చాడు ఆతను.

"జీవితం అనేది ఓ ప్రవాహమని నాకర్ధమయింది. అదో ప్రయాణమని కూడా చెప్పగలను. ఏ జీవి పయనం అయినా కన్నతల్లి ఒడిలోంచి నేలతల్లి ఒడిలోకే. ఈ మధ్యలోనిదే జీవితం. ప్రతి రోజూ యీ శరీరంలోనూ, మనసులోనూ అనేకానేక మార్పులు చోటుచేసుకుంటూనే వుంటాయి. పుట్టేవాళ్ళు పుడుతూ వుంటే, లోకాన్ని వదిలి వెళ్ళిపోయేవారు వెళ్ళిపోతూ వుంటారు. అనేకానేక సంఘటనల మాల జీవితమంటే. కొన్ని సంఘటనలు అతి కష్టపెడితే, కొన్ని సంఘటనలు సుఖాన్నిస్తాయి. ఆ కష్టమూ. యీ సుఖమూ శాశ్వతమైనవి కావు" ఆగాడాయన.

"ఇంకో సంగతి చెప్పా... ఈ జీవితం సంగతి పక్కన పెడితే, యీ శరీరమూ, శరీరం నింపుకున్న మనసూ కూడా భిక్షా పాత్రలే. మనసు గనక ఓ పాత్ర అయితే, ఆ పాత్ర నిండుగా కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే గుణాలు వున్నాయి. రోజురోజుకీ మనని మనం, మనలోని మనని చూసుకుంటూ, ఆ 'అరిషడ్వర్గాల' స్థానంలో 'ప్రియ' షడ్వర్గాలని నింపుకుంటే ఆనందం అనేది లభ్యమవుతుందని నా అనుభవంలో నేను గ్రహించాను" అన్నాడాయన.

"ప్రియ షడ్వర్గాలంటే" అడిగాడు వేంకటాచార్యులు.

"అరి అంటే శత్రువు. ప్రియ అంటే చెప్పనక్కర్లేదుగా. ఆ ఆరు శత్రు వర్గాలకి బదులు, జాలి, దయ, కరుణ, ప్రేమ, శాంతి మరియు అహింస అనే ప్రియ వర్గాలని మెల్లమెల్లగా ఈ మనస్సనే భిక్షాపాత్రలో నింపితే, ఆనందమే మన స్వరూపమవుతుంది" చల్లగా చెప్పాడాయన.

"మరి యీ గుడీ, మీ భక్తీ?" అడిగాడు శర్మ.

"ఊరి బయట ఉన్నది గనక ఉన్నా. వెలవెలబోయింది గనక సింధూరం తెచ్చి మిలమిలాడేలా చేశాను. హనుమంతుడు మనసు అనే సంద్రాన్ని క్షణంలో దాటించగల శక్తిపరుడు. అంతే" నవ్వాడాయన.

శుభమస్తు. మళ్ళీ కలుద్దాం.

\- భువనచంద్ర

# పూరి జగన్నాధ స్వామి వైభవం



డా.పోచనపెద్ది వెంకట మురళీ కృష్ణ

**పూరి జగన్నాధుని రధయాత్ర తెలుగువారికి అత్యంత ప్రీతి పాత్రమైనది. కాని ఆ స్వామికి సంబంధించిన పురాణగాధ సంపూర్ణంగా కొద్దిమందికి మాత్రమే తెలుసు.**

**స్కాందపురాణాంతర్గతమైన జగన్నాధ క్షేత్ర మాహాత్త్యాన్ని యధామూలంగా, సరళ, వ్యావహారిక భాషలో అనువదించి మన పాఠకులకు ప్రతి నెల అందిస్తున్నాము. చదవండి, చదివించి మోక్షాన్ని పొందడి.**

**- సంపాదకురాలు**

ఇంద్రద్యుమ్నుడు తొమ్మిది వందల తొంభై తొమ్మిది అశ్వమేధ యాగాలు పూర్తి చేసాడు. వెయ్యవ యాగం చేయడానికి ప్రారంభించాడు. ప్రతి రోజు రాజు శరీరంలో దివ్య తేజస్సు అభివృద్ధి చెందుతోంది.

ఇకఏడురోజులలో యజ్ఞంపూర్తి అవుతుంది. ఇంద్ర ద్యుమ్నుడు స్వామిని ధ్యానిస్తున్నాడు. ఆ ధ్యానంలో ఉండగా రాత్రి నాలుగవ జామున రాజుకి స్పటికంతో నిర్మించిన శ్వేత ద్వీపంకనబడింది. ఆ ద్వీపంచుట్టు పాల సముద్రం ఉంది. కల్ప వృక్షంనుండి వ్యాపిస్తున్న సువాసనలు ద్వీపం అంతటా వ్యాపించాయి. కల్ప వృక్షంలోని ప్రతి భాగంలోను నారాయణ స్వరూపం కనబడుతోంది. ఆ చెట్టు మధ్యలో శంఖ చక్ర గదా ధరుడైన స్వామి ఉన్నాడు. కుడివైపున ఆదిశేషుడు ఉన్నాడు. లక్ష్మీదేవి శుభలక్షణములు కలిగి అభయ, వరద ముద్రలు కలిగి, పద్మము ధరించి ఉంది. వారి ఎదుట బ్రహ్మ చేతులు జోడించి నిలబది ఉన్నాడు. స్వామికి ఎడమ పక్కన చక్రం ఉంది. ఇంతకు మునుపు చూడని స్వామినిఈవిధంగాస్తుతించాడు

ఇంద్రద్యుమ్నుడు నారాయణుని స్తుతించుట-----

సంసార పతితశ్రాంత దుఃఖ ద్వంస నమో&స్తుతే

దుర్భేద్య హృదయగ్రంధి భేదకాయ నమో&స్తుతే

శబ్దబ్రహ్మాభిదానాయ జగద్రూపాయ తే నమః

బ్రహ్మాండకోటి ఘటనా శిల్పినే చక్రిణే నమః



కరుణామృత పాదోధి సుధాధామ్నేనమో నమః

దీనోద్ధారైక గుహ్యాయ కృపాపాదోదధయే నమః

ప్రకాశకానాం సూర్యాదిజ్యోతిషాం జ్యోతిషే నమః

ప్రతిస్వస్వనదీస్తాయ అంతః పాపాగ్నయే నమః

పావకాయ పవిత్రాయ పవిత్రాణాం నమో నమః

గరిష్ఠాయ వరిష్ఠాయ ద్రాఘిష్ఠాయ నమో నమః

నేదిష్ఠాయ దవిష్ఠాయ క్షోదిష్ఠాయ నమో నమః

వరేణ్యాయసుపుణ్యాయనారాయణనమో&స్తుతే

పరిత్రాహి జగన్నాథ దీనబంధోనమో&స్తుతే నిస్తీర్ణో&హంభవాంభోధింప్రాప్యత్వాంతరణింసుఖామ్

త్వయిదృష్టి రమానాథ క్లేశ వ్యపగతా మమ

చిదానందస్వరూపంత్వాంప్రాప్తానాందుఃఖసంక్షయః

ధృవం నాథ సముత్పన్న పరమానందహేతుకమ్

త్రాహి త్రాహి భవాంభోధి మగ్నం మాం దీనచేసమ్

మధ్యాహ్నార్కే వ్యోమ్ని కుతః సంతమసోదయః

ధ్యానస్థితః స్తువన్నేవం ప్రణమ్య జగదీశ్వరమ్

జగత్తుకు ఆధారమైన వాడు, త్రిగుణము

లకు అతీతమైన వాడు, జ్ఞాన స్వరూపుడవు, శబ్ద బ్రహ్మ అను పేరుగలవవవాడు, ప్రపంచమే రూపం

గాకలవాడు, కోటి బ్రహ్మాండాలు నిర్మించిన వాడా నీకు నమస్కారము.

జాలి అను సముద్రమే నివాసముగా కలవాడు, దీనులనుఉద్ధరించువాడా,రహస్యస్వరూపుడా,సూర్యునికి,నక్షత్రాలకికాంతినిచ్చువాడా, నీకు నమస్కారము.

పవిత్రులలో పవిత్రుడైనవాడా, శ్రేష్ఠుడైనవాడా, దగ్గరగాను, దూరంగాను ఉండువాడా, దీనబంధు నీకు నమస్కారం. సంసార సముద్రాన్ని దాటించు నావ అగు నిన్ను ఆశ్రయించాను. నిన్ను చూడగానే నా దుఃఖాలు నశిం చాయి. నిన్ను ఆశ్రయించిన వారి పాపాలు నశిస్తాయి.పరమానందాన్నికలిగించువాడవు. సంసార సముద్రంలో మునిగిన నన్ను రక్షించు. సూర్యుడు ప్రకాశిస్తూండగా చీకటికి తావెక్కడిది?99-130

ఇంద్రద్యుమ్నునికి తెలివి వచ్చింది. తనకు వచ్చిన కలగురించి నారదునికి చెప్పాడు. " ఓ రాజా! పది దినాలలో నీ కల నెరవేరుతుంది. ఈ యజ్ఞం పూర్తి అవగానే భగవంతుడు నీకు ప్రత్యక్షం అవుతాడు. యజ్ఞం పూర్తిచేయి. భగవంతుడు ఎప్పుడు ఏది చేస్తాడో ఎవరికి తెలియదు. అదృష్టవంతులకు మాత్రమే ఇటువంటి కల వస్తుంది" అని నారదుడు చెప్పాడు. ( 131 - 139)

స్కాంద పురాణంలోని వైష్ణవ ఖండంలోని, పురుషోత్తమ క్షేత్ర మాహాత్మ్యంలోని జైమిని- ఋషి సంవాదం అను పదిహేడవ అధ్యాయం సమాప్తం

## 18. వ. అధ్యాయం

### జైమిని ఋషి సంవాదము

### ( కల్ప వృక్ష ఆవిర్భావము)

ఆ యజ్ఞం జరుగుచున్నప్పుడు ముల్లోకాలు ఒక్కటిగా ఉన్నాయి. వేదఘోష ఇతర శబ్దాలను కప్పి వేస్తోంది. రాజు అవభృథ స్నానం చేయడానికి ప్రత్యేక ఏర్పాటు చేసారు.

దక్షిణ సముద్ర తీరంలో బిల్వేశ్వరుని ఆలయానికి దగ్గరగా నియమించిన సేవకులు సముద్రంలో తేలియాడుతున్న అద్భుతమైన వృక్షాన్ని చూసారు. చుట్టు సువాసనలు వెదజల్లుతున్నాయి. దేవ సంబంధమయిన వృక్షంలాగ ఉంది. రాజభటులు ఈ విషయాన్ని రాజుకు చెప్పారు. " ఈ శ్రేష్టమైన వృక్షం ఎందుకు వచ్చింది, మనం ఏంచేయాలి?" అని ఇంద్రద్యుమ్నుడు నారదుని అడిగాడు.

" రాజా! నీ భాగ్యం పండింది. నీకు కలలో కన బడిన విష్ణు మూర్తి ఇప్పుడు ఈ రూపంలో వచ్చారు. నీవలన అందరు స్వామినిచూడగలుగుతున్నారు.నీవు అవభృథ స్నానం పూర్తి చేసి, సముద్ర తీరంలో ఉత్సవాన్ని నిర్వహించి, ఒక వేదికను నిర్మించి, దానిపై కల్పవృక్షం ప్రతిష్ఠిద్దాం" అని నారదుడుబోధించాడు.

ఇంద్రద్యుమ్నుడు ఆనందించి ఆ వృక్షాన్నిచూసి సాక్షాత్ నారాయణుని చూసినట్లు భావించి నమస్కరించాడు. బ్రాహ్మణులసహాయంతో ఆవృక్షాన్ని సముద్ర తీరానికి తీసుకు వచ్చాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు.

దేవదుందుభులు మ్రోగాయి.స్త్రీలు వింజామరలు వీస్తున్నారు. పండితులు స్తుతిస్తున్నారు. రాజు ఆ వృక్షానికిపూజించి, అనేక ఉపచారాలు చేసాడు. ( 1 - 31)

నారదా! విష్ణుస్వరూపం ఎలా ఉంటుంది? ఈ వృక్షాన్నిఎవరు విగ్రహంగా నిర్మిస్తారు? అని అడిగాడు.

రాజా! భగవంతుని స్వరూపాన్ని ఎవరు తెలుసుకో గలరు? బ్రహ్మకూడా స్వామి లీలను తెలుసుకోలేడు." అని నారదుడు చెబుతుండగా ఆకాశంనుండిఒక శబ్దం వినబడింది.

" స్వామి ఇక్కడ స్వయంగా ఆవిర్భవించాడు. ఈ వృక్షాన్ని పదిహేను రోజులు కప్పి ఉంచండి. ఇక్కడికి ఒక వృద్ధ వడ్రంగి వస్తాడు. అతడు స్వామి ప్రతిమను తయారుచేస్తాడు. అతనిని లోపలికి పంపించు. అతడు శిల్పాన్ని చెక్కుతున్నప్పుడు ఎవరు శబ్దాన్నివినకూడదు. బయట వాయిద్యాలు మోగించండి. శిల్పం పూర్తయ్యాక భగవంతుడు చెబుతాడు" అని ఆకాశ వాణి చెప్పింది.

రాజు ఆవిధంగా చేయడానికి నిర్ణయించుకున్నాడు. ఇంతలో ఒక వృద్ధ వడ్రంగి వచ్చి " నేను భగవంతుని విగ్రహాన్ని చేస్తాను" అని చెప్పాడు. భగవంతుడే ఈ రూపంలో వచ్చాడని అందరు భావించారు. రాజు ఆ వడ్రంగిని సత్కరించి గుడారంలోపలికి పంపించాడు. ( 32- 46)

స్కాందపురాణంలోని వైష్ణవ ఖండంలొ పురుషోత్తమ క్షేత్రవైభవంలో జైమిని ఋషి సంవాదము అను పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం

## 19 వ అధ్యాయం

## జైమిని - ఋషి సంవాదం

## ( విగ్రహ నిర్మాణం)

ఆకాశమునుండి గీతాలు వినిపిస్తున్నాయి.పారిజాత పుష్పాల వాసన అంతటా వ్యాపించింది. చిరుజల్లులు కురుస్తున్నాయి. ఐరావతాల మదపు వాసన వ్యాపించింది. దేవతలు ఆ వృక్షాన్ని ఉపాసిస్తున్నారు. నీల మాధవుని చూసిన అనుభూతి పొందుతున్నారు.

ఆవిధంగా పదిహేనురోజులు గడిచాయి. వృధ శిల్పి ఆ వృక్షాన్ని నాలుగు రూపాలుగా చెక్కాడు. ఆ స్వామి బలభద్రుడు, సుభద్ర, సుదర్శన చక్రంతోకూడి సింహాసనంపై కూర్చుని ఉన్నాడు. శంఖము,చక్రము, గద, పద్మాలతో నారాయణుడు ఉన్నాడు. గద, చక్రము, రోకలి, పద్మము ధరించి బలభద్రుడు సర్ప రూపంలో, ఏడు పడగలతో స్వామికి గొడుగు పట్టి ఉన్నాడు. సుభద్ర అభయ, వరద ముద్రలతో పద్మాన్ని ఒకచేత్తో పట్టుకొని ఉంది. లక్ష్మీదేవి సుభద్రగా రోహిణికి కుమార్తెగా జన్మించింది. బలరాముడు బలభద్రునిగా అవతరించాడు. ఒక్క క్షణం విడిచిఉండడు. శ్రీకృష్ణునికి బలరామునికి భేదము లేదు. లక్ష్మీదేవి పురుషరూపంలో నారాయణుడుగాను, స్త్రీ రూపంలో లక్ష్మిగా ఉంటుంది.

" రాజా! ఈ ప్రతిమలను వస్త్రము లేకుండా ఎవరు చూడకూడదు, విష్ణువునకు నల్లని రంగు, బలభద్రునకి తెలుపు రంగు, సుభద్రకు కుంకుమ ఎరుపు,చక్రానికి ఎర్రరంగు వేయాలి. వేరు,వేరు అలంకారాలు చేయాలి.ఈ శిల్పాలను నారతో కప్పి ఉంచాలి. ప్రతి సంవత్సరం కొత్తనారను చుడుతు ఉండాలి. నీకోరిక తీర్చుటకే స్వామి ఇక్కడ ఆవిర్భవించాడు. సమస్త జీవరాసులు భగవంతుని దర్శించుకొని మోక్షాన్ని పొందుతారు. ఈ కల్పవృక్షానికి వాయవ్య దిశలో వందచేతులదూరంలో, ఒక భవనాన్ని నిర్మించు. ఈ భవనం నరసింహస్వామి దేవాలయానికి ఉత్తర దిక్కున వేయిచేతులదూరంలో ఉండాలి. ఆ భవనంలో స్వామిని అక్కడ ప్రతిష్ఠించు. బోయవాడయిన విశ్వావసువు, పురోహితుడయిన విద్యాపతి వంశం వారికి మాత్రమే పూజించే అధికారం ఉంది." అని ఆకాశవాణి చెప్పింది. ( 1- 34 )

(ఇంకా వుంది)

# సప్త మోక్ష నగరాలు



**కొత్త రామానందం**

జీవితం ---- ముఖ్యంగా మానవ జీవితం గొప్పది. అమూల్యా మైనది. ఆధ్యాత్మిక లో చెప్పాలంటే దుర్లభమైనది. కేవలం లౌకిక జీవితాన్ని ఆరాధించే వారి సంగతి పక్కనుంచితే భగవంతుడే పర-మావధిగా ఆయనను పొందేందుకే మానవ జీవితం అనే స్పృహ కలిగి, ఆ గమ్యానికే దృఢ చిత్తంతో సమాయతమైన వారికి జీవితం అపురూపమై నది. మానవ జన్మ ఓ దివ్య వరంగా లభించింది. దీనిని దుర్వినియోగం చేసుకోకూడదంటారు మన పెద్దలు. జ్ఞానం లేకుండా ముక్తి లక్తి భించదు. అందుకే మహాపుఋుషులను ఆశ్రయించి, ఆత్మ --పరమాత్మ జ్ఞానం పొందాలి. ధర్మార్ధ  కామమోక్షాన్ని విడిచి మధ్య ఉన్న అర్ధ  కామాల వెంట నేటి మనిషి పరుగులు చేస్తు న్నారు. పరమాత్మ పట్ల చిత్తం అంటే మనసును లగ్నం చేయాలి. మన మనసు ప్రవర్తనను నిరోధించడమే యోగం.

ఎన్ని ఒడుడుకులు ఎదురైనా పదిలంగా బతకాలని ప్రతి జీవి తాపత్రయపడుతుంది. అందులో ప్రమా-దరహితంగా, ప్రమోద భరితంగా సాగాలనే కాంక్ష అంతర్లీనమై ఉంటుంది. జటిల సమస్యలు ఎదురైన-ప్పుడు ఏమైనా మహిమాన్విత శక్తి తనకు సహక క్తి రించాలని ఆశించడం సహజం. భగవంతుని అను-గ్రహం పొంది, సమస్యలను అధిగమించగల శక్తి పొందాలనే ప్రయత్నమే --- భక్తి మార్గం. భగవంతుడు అపార కరుణా సముద్రుడు. దయాళుడు. ఆయన మానవునికి సద్బుద్ధినిచ్చి సన్మార్గంలో నడిపిస్తా డు. అందరికీ ప్రేరణ ఇస్తాడు. ఆయన ప్రేరణ జగతి జాగృతికి ఆధారం. భవ బంధాలనుండి విముక్తి చేయ-డానికి ఎన్నెన్నో మార్గాలు చూపాడు. ఎన్నో దివ్య ధామాలను సృష్టించాడు.  వేదాలు పుట్టిన ఈ పవిత్ర భూమిపై ముక్తి ధామాలుగా సప నగరాలు ఉన్నాయి. అందు పరమాత్మ అనేక అనేక అవతారాలుగా ఉద్భవించి దుష్ట శిక్షణలు గావించి తన మహిమలతో కృపాదృష్టితో కాపాడుతున్నాడు, మరియు నూ-తనోత్సాహాన్ని నింపుతున్నాడు.. "అయోధ్యా, మధురా మాయా, కాశీ కంచి అవంతికాపురి ద్వారవతి చైవ సప్తైతే మోక్ష దాయకా" భారత దేశంలో అనేక దివ్య క్షేత్రాలు ఉన్నాయి. అయితే సప మోక్ష నగరాలు మోక్ష ధామాలుగా ప్రసిద్ధి గాంచి మనందరకూ సుఖ శాంతులు, విజయ కాంతులు ప్రసాదిస్తు న్నాయి. అం-దువల్ల మనకు ఆధ్యాత్మిక చైతన్యం విరాజమానమై దైవం పట్ల భక్తి ప్రపక్తి త్తులు పెరిగి ఆత్మ విచారణ చేయగలుగుతున్నాము. ధర్మ బద్ధమైన జీవనాన్ని ఎంపిక చేసుకుని పుణ్యా క్షేత్రాలను సందర్శిస్తూ ముక్తి కోసం ప్రయత్నించడం మన ధ్యేయంగా చేసుకోవాలి. ముఖ్యంగా జీవిత కాలంలో సప్త మోక్ష ధామాలను దర్శించి పునీతులమవ్వాలి. భగవంతుడు భక్తుని నుండి కోరుకునేది కూడా అదే.

ఆసేతు హిమాలయ పర్యంతం వ్యాపించిన మన భారతావనిలో ఎన్నో జాతులు, తెగల ప్రజలు, భాషలు ఉన్నా మొత్తం జాతినంతటినీ సమైక్య పరచి ముందుకు నడిపిస్తోంది మన సనాతన సంస్కృతి. అట్టి సంస్కృతికి ప్రతిరూపాలు మన పుణ్యా క్షేత్రాలు, తీర్థాలు. వాటిలో అనాదికాలం నుంచి విఖ్యాతి చెంది భక్తులకు మోక్షదాయికాలుగా ఏడు పుణ్యా క్షేత్రాలు అత్యంత ప్రాముఖ్యత పొందాయి.

అవి **అయోధ్య, మధుర, మాయ (నేటి హరిద్వార్), కాశీ, కంచి, అవంతిక(నేటి ఉజ్జ-యిని)** మరియు **ద్వారక.**

## 2. మధుర

### పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
### ధర్మ సంస్థాపనాయ సంభవామి యుగే యుగే



(గత సంచిక తరువాయి)

అలాగే గోపికా వస్త్రాపహరణం. ప్రాతః కాలంలో యమునా నదిలో జలక్రీడలు ఆడుతున్న గోపికల వస్త్రములు అపహరించాడు. వారిని నీటి నుంచి వెలుపలకి వచ్చి వలువలు తీసుకోండని పలికాడు. గోపికలు మనసు దిట్టపరచుకుని నది నుండి వెలుపలకి వచ్చారు. కృష్ణునికి నమస్కరించి వారి వస్త్రములను తీసుకున్నారు. ఇందులో మనకు కనిపించేదేమంటే గోపికలనే జీవులు మాయ అనే వస్త్రం ధరించారు. భగవంతుడు ఆ మాయను అపహరించి, వారి యందలి అహంకారం, దేహాత్మభావం తొలగించాడు. దేహాభిమానం లేని జీవులు భగవంతునికి చేరువవుతారు. ఆ వ్యక్తులకు మోహం ఉండదు. గోపికలు చేతులెత్తి నమస్కరించి సర్వస్వం గోవిందునికి సమర్పించి ఆనందమనుభవించారు.

శ్రీకృష్ణుని లీలలు కొన్ని విస్మయం కలిగించి, 'ఈయన సామాన్యుడు కాడు' అనిపించేవిగా ఉంటే, మరికొన్ని అతని వ్యక్తిత్వంలోని చిత్రమయిన చాతురిని చాటేవిగా ఉంటాయి. శ్రీకృష్ణుడు యోగీశ్వరేశ్వరుడు. ఆయన తన భక్తులను సదా రక్షిస్తూ, తత్వబోధ చేస్తూ ధర్మాన్ని రక్షించాడు. శ్రీకృష్ణ నామం ఈ సంసార సాగరాన్ని దాటించే నావ. ఆ నావలో పయనిస్తే జీవితం నిశ్చింతగా సాగుతుంది.

బృందావనంలో రాసలీలలు

భాగవత పురాణం ప్రకారం కృష్ణుడు రాధ, గోపికలతోకలిసి బృందావనం, యమునాతీరంలో రాస చేశాడు. రాస జరుగుతూ అందులో తాదాత్మ్యత చెంది ఉన్నప్పుడు మధ్యలో కృష్ణుడు మాయమవుతుంటాడు. వియోగం వల్ల వచ్చిన మానసిక వ్యధకు తట్టుకోలేక గోపికలు కృష్ణలీలలను తామే ప్రదర్శించటం మొదలుపెట్టారు. అదే కాలక్రమేణా రాసలీల అయింది. శ్రీకృష్ణుడి బాల్యమే ఇందు ప్రధానం.

శ్రీకృష్ణ భగవానుడి బాల్యక్రీడలకు, లీలావిన్యాసాలకు వేదిక బృందావనం. రాధాకృష్ణులు ఇప్పటికీ రాత్రివేళ బృందావనం, సేవాకుండ్ ప్రాంతంలో విహరిస్తారట. అది సామాన్యులు చూసి తట్టుకోలేరు. అందుకని సాయంత్రం 7 గంటలు కాగానే ఎవరినీ ఆ ప్రాంతంలో ఉండనీయరు. చీకటి పడగానే వందలాదిగా ఉన్న కోతులు కూడా వెళ్లిపోతాయాట.

ఇచ్చటి స్థానికులు ఈ పుణ్యస్థ-

లిని బృందావనం అని అంటారు. తులసివనాలు. మయూరాలు, గోవులు ఎక్కువగా కానవస్తాయి. గోకులం ఎంచుకున్న ఈ పరిసర ప్రాంతాలను 'వ్రజభూమి' అని పిలుస్తుంటారు. గోకులానికే మకుటాయమానం - ఈ బృందావనం. యమునా నది తీరాన ఉన్న ఈ యాత్రాస్థలిలో 32 స్నాన ఘట్టాలు ఉన్నాయి. ప్రతి ఘాట్ కు ఒకో చరిత్ర వుంది. ఇక్కడి బీర్ ఘాట్ లో కన్నయ్య గోపికల చీరలను దొంగిలించింది. కాళీ ఘాట్ లో కాళీయ మర్దనం జరగటం వల్ల ఆ పేరు వచ్చింది. దుంగల్ ఘాట్ లో రాధామాధవులు జలక్రీడలు ఆడటం వల్లనూ, శృంగార్ ఘాట్ లో వారు అలంకారం చేసుకోవటం వల్ల వీటికి ఆ నామధేయాలు. యమునలో స్నానమాచరిస్తే పునీతులౌతారని ఒక నానుడి.

బృందావనంలోని ఒక ఇసుక రేణువును శిరసున ధరిస్తే శాశ్వత బ్రహ్మలోక ప్రాప్తి లభిస్తుంది. కాశీలో వెయ్యి సంవత్సరాలు తపస్సు చేసిన ఫలితం ఒకసారి బృందావన దర్శనంతో లభిస్తుంది. అక్కడి ప్రతి అణువూ కృష్ణ నామాన్నే పలుకుతుంది. అచ్చట వీచే పిల్లగాలులు సైతం రాధామాధవ గాథలను గానం చేస్తూ ముందుకు సాగుతుంటాయి. ఇక్కడ కోతుల బెడద ఎక్కువ. అవి ఎక్కువగా అల్లరి చేస్తుంటాయి. ఊరంతా వేలాది గోవులు గోపబాలుడైన కృష్ణుని జ్ఞాపకార్థం తిరుగుతుంటాయి. అచ్చటి ప్రతి ఇంటి గోడమీద శ్రీ రాధే అని వ్రాసివుంటుంది. గ్రామస్థులు అందరి నాలుకలపై రాధానామమే నాట్యమాడుతుంటుంది. విచారం వ్యక్తం చెయ్యాలన్నా, వీడ్కోలు చెప్పాలన్నా, క్షమాపణలు అడగాలన్నా 'రాధే రాధే' అంటారు.

బృందావనంలో ముగ్గురు మహానుభావులు అడుగుపెట్టి తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. ఇతరులకు మార్గదర్శనం చేశారు. కృష్ణ భక్తి ప్రచారం చేసి ధన్యులయినారు. వారు వల్లభాచార్యులు, చైతన్య మహాప్రభువు మరియు మీరాబాయి. వల్లభాచార్యులు తన 11 వ సంవత్సరంలోనే ఈ ప్రాంతానికి వచ్చి ఇక్కడ కృష్ణస్వామిని దర్శించుకుని, ధర్మ సంస్థాపన ధ్యేయంగా తన జీవితాన్ని అంకితం చేశాడు. ఈ మహాపండితుడైన వల్లభాచార్యులు తెలుగువారు. ఆయన భారతదేశమంతా తిరిగి, భగవద్గీతని ప్రచారం చేసి, కృష్ణుని యందు అందరికీ ప్రేమాభిమానాలు ఉండేలా చేశాడు. సంవత్సరంలో 4 నెలలు బృందావనంలో ఉంటూ ప్రవచనాలు ఇస్తుండేవారు.

అనంతరం బహుళ ప్రచారంలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడు శ్రీ చైతన్య మహాప్రభువు. ఆయన 1515 వ సంవత్సరంలో బృందావనాన్ని సందర్శించారు. అనేక ప్రాచీన ఆలయాల్ని వెలుగులోకి తీసుకువచ్చారు. అట్టి ఆలయాల జీర్ణోద్ధరణ గావించారు.

ఇక మీరాబాయి మేవార్ సామ్రాజ్యాన్ని వదిలి బృందావనం జేరి, తన మనసును, తనువును కృష్ణ భక్తిలోనే లీనం చేసుకుని కృష్ణుని సేవలో రోజుకు 14 గంటలు ఇక్కడనే గడిపిన మహాసాధ్వీమణి. మీరాబాయి వంటి కృష్ణ భక్తులు కట్టించిన కృష్ణ మందిరాలు చూడాలంటే బృందావన యాత్ర చేయవల్సిందే.



(ఇంకా వుంది)

# సినిమా!

## (ఇదో సప్త వర్ణాల సినీ జగత్)



నండూరి సరోజాదేవి

అలాగే, ఆ సుప్రసిద్ధ నటీ,నటులు ఎంతో మంది తమ నటనలలో రాణిస్తూనే వున్నా..ముందులో చెప్పుకున్నట్టు నందమూరి రామారావు గారు మాత్రం,ఎంతో ప్రత్యేక గుర్తింపుతో పాటుగా "అందరిలోకి మేటి,తనకి తానే సాటి" అని అనిపించుకునేలా ఉండడమే కాకుండా,ఎంటువంటి గర్వానికి, ఆభిజాత్యానికి లోను కాకుండా.. **అప్పటిలో, తమ తరువాత చిత్రసీమలోకి అడుగు పెట్టినటువంటి "శోభన్ బాబు, కృష్ణ, మురళీ మోహన్,బి.సరోజా దేవి, జమున, కృష్ణ కుమారి వంటి ఎంతో మంది నటీ నటులలో టాలెంటుని గుర్తించీ".. ఆపన్న హస్తంలా చేయి అందించి, వారికి సపోర్టుగా వుంటూ సినిమాల్లో మరింత పైకి రావడానికి రామారావు గారు కారణం అయ్యేరనేది,అక్షర సత్యం అని కూడా సన్నిహితులు అందరూ చెప్పుకుంటూ ఉండేవారు.

అంతేకాదు, ఆ నటులందరూ కూడా అలా అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరుచుకుని, తమ నటనలో మరింత మెళుకువలు నేర్చుకుని.. 'మంచి కథా వస్తువు,నటనలతో.. మహిళలని,అప్పటి కుర్రకారుని ఆకట్టుకుంటూ' సినీ రంగాన వున్నంతకాలం వారి అభిమానాన్ని నిలబెట్టుకునేలాగానే మనగలిగారు అని చెప్పాలేమోనూ.

మోహనబాబు, హరనాథ్, కృష్ణంరాజు ,శ్రీధర్, సాయికుమార్, రాజశేఖర్, చలం, వంటి హీరోలు ఎందరో కూడా పోటా పోటీ నటనలతో, చాల కాలం ఆ సినిమా ఫీల్డ్ లో నిలదొక్కుకుని, ప్రజల అందరి మెప్పుని ఎంతగానో పొందుతూ వచ్చారు.

**ఈ సందర్భాన ఒక విషయం అనుకుంటే బాగుంటుందేమోను?.. 'రాజకీయంగా కూడా ఎంతో అనుభవం, పేరు-ప్రఖ్యాతలు, ఎన్నో ఆశయాలు, ఉన్నతమైన పద్ధతులతో జీవితాన్ని ఒక మార్గదర్శకంగా చక్కదిద్దుకున్న' మురళి మోహన్, కృష్ణ, చిరంజీవి, మోహనబాబు వంటి సీనియర్ నటులు తమ సినీరంగ ప్రవేశము నుండి.. "వారు ఎదుర్కొన్న సమస్యలు, వాటిని దాటుకు వచ్చిన వైనం, షూటింగ్ సమయాలలో నటించేటప్పుడు తామెంతెంత కష్టపడేవారో, మెళకువలు ఎలా నేర్చుకునే వారో తాము అలవర్చుకున్న క్రమ శిక్షణ, అనవసరపు ఖర్చులు లేకుండా ఆర్ధికంగా నిలదొక్కుకునే ప్రయత్నం ఎలా చేయగలిగారో?" వంటి తమ తమ విధాన సరళిని, తమ ఆలోచనా ధోరణిని..

"ఈ యువ తరాన.. సినీ ఫీల్డ్ లో ప్రవేశించిన నటీ-నటులకి " ఒక రోల్ మోడల్ గా ఆ పాత సినిమాల సమయంలోని, తమ అనుభవాలు అన్నింటినీ.. "రచనల రూపకంగా కానీ, వారందరితో 'జూమ్ సమావేశాలు' ఏర్పాటు చేసి కానీ (ప్రస్తుతం కరోనా వున్న కారణంగానూ),సోషల్ మీడియాలోని ముఖ్య సాధనాల ద్వారా కానీ" ఆ నటుల వరకు మాత్రమైనా,వివరించి తెలియ చెప్పడం వంటి ప్రయత్నం చేస్తే బాగుంటుంది కదా? ఎందుకంటే, ఈ కాలం కుర్ర నటులకి "గత సినిమాల గురించిన ఆసక్తి కానీ.. ఆ సీనియర్ నటుల గురించి తెలుసుకుని, వారిని ఫాలో అయితే తమ భవిష్యత్ బాగుంటుందనే ఆలోచన కానీ, వారిలో చాలా మందికి అనిపించకపోవచ్చును.. ఆ ఉత్సహమూ ఉండకపోవచ్చును!" నిజానికి ఎందరో నటుల 'జీవిత చరిత్రలు' ఎప్పటి నుండో రాయబడే వున్నాయి. అయితే, అది చదివి తెలిసికోవాలనే ధ్యాసే ఆ జూనియర్స్ కి కలగకపోవచ్చు కదా?

**అందుకే! పైన అనుకున్న విధంగా,అప్పటి ప్రముఖ నటులు తప్పకుండా పూనుకునీ. "తమ తమ సినీ గత అనుభవాలను" యువ నటులకి చేరవేసి, వారి సినీ భవిష్యత్ కి బాటలు వేయగలిగితే.. సినీ కుటుంబాన, సీనియర్ నటులకి ప్రత్యేక గౌరవం ఏర్పడడంతో పాటుగా "ఒక కొత్త ఒరవడితో, నూతన విధానంతో, ఒక కొత్త చరిత్రకి శ్రీకారం చుట్టినట్టు" కూడా అవుతుందేమో అని మురళీ మోహన్, చిరంజీవి గారి లాంటి వాళ్ళు ఆలోచించాలేమోను. ఏదో యాక్టింగ్ కోసం ఇనిస్టిట్యూట్ లో చేరడం, స్లిమ్ బాడీ మెయింటైన్ చేయడానికి జిమ్ లకి వెళ్లడం, ఆహార నియమాలు పాటించడం" వంటి ఈ అవసరాలు, ఈ ఇంట్రస్టులతో పాటు.. సీనియర్ నటులు "తమ గురించి, అంతలా కలగ చేసుకుని.. సినీ ఫీల్డ్ లో వారి ఎక్సపీరియెన్స్ ని వివరించి, ఆ మెళకువలు నేర్పుతున్నారు అంటే" ఆ యువ నటులకి ఎనలేని శక్తి, ఉత్సహం కూడా మరింత ఏర్పడతాయి.

(ఇంకా వుంది)

# నూతన జాతీయ విద్యా విధానంపై చిన్న అవగాహన



పాలకుర్తి రామమూర్తి

**నాస్తి గ్రామః కుతస్సీమా నాస్తి విద్యా కుతో యశః**
**నాస్తి జ్ఞానం కుతో ముక్తిః భక్తిర్నాస్తి కుతస్తుధీః!**

ఈ విధానంలో విద్య వల్ల ముఖ్యంగా తనపై తనకు నమ్మకం ఏర్పడేది. సమర్థత పెరిగేది. దీనికి ముఖ్య కారణం గురు శిష్య బంధం. గురువు శోధన, సాధన, బోధనలు ఊపిరులుగా, అర్హత ప్రాతిపదికగా ఎవరికి ఏది ఎంత అవసరమో గ్రహించి ఆ ప్రకారం అందించేవాడు. గురువు జ్ఞానాన్ని ప్రదానం చేసే వాడు. అంటే పంచేవాడు. శిష్యుడు ఆ జ్ఞానాన్ని అర్హతను పొంది శ్రద్ధతో గ్రహించేవాడు. గ్రహించడం ఆదానం అంటాము. ఇందులో ఆదాన ప్రదానాలు ప్రధానమైనది. ఇది చాలాకాలం బాధ్యతగా తీసుకొనబడిందే కాని వ్యాపారంగా చూడబడలేదు.

కాలం నిరంతరాయంగా నిరవధికంగా గతం నుండి వర్తమానం ద్వారా భవిష్యత్తులోకి ప్రవహించేది. అది ఒక పరిణామ క్రమం. ఇందులో సమయమనేది కాలవ్యవధి మాత్రమే. జరిగే సంఘటనలకు మధ్య ఉండే వ్యవధియే సమయము.

**పరిణామ క్రమం...**

కాలక్రమేణా విద్యలక్ష్యాలు మారాయి. అవసరాలు మారాయి. ఆ విద్యాభ్యాస విధానంలో మార్పులు చోటు చేసుకున్నాయి. కారణాలు అనేకం. విదేశీ దాడులు, మత మార్పిడులు, మారిన విశ్వాసాలు, ఆధిపత్య ధోరణి, వ్యక్తి జీవన విధానంపై అమిత ప్రభావాన్ని చూపాయి. అందులో విద్యావిధానమూ ప్రభావితమయింది. గురుకులాలు గతి తప్పాయి. విద్యాలయాలలో విద్య "లయ"మయింది. విద్యార్థులలో విధేయత తగ్గిపోయింది. శోధనలేని పరిశోధనల వల్ల ఆశించిన ఫలితాలు కరవయ్యాయి. నైతిక విలువలు స్వార్థపూరితమై మానవత్వానికి దూరంగా నడిపిస్తున్నాయి. అర్హతలేని మతాచార్యుల అవగాహనా లేమి సత్యానికి దూరం చేస్తూ సహనానికి, సమగ్రతకు భంగం కలిగిస్తుంది. దీనికి ముఖ్య కారణం విద్య వ్యాపారానికి పెట్టుబడి కేంద్రంగా మారడమే.

బ్రిటీశ్ వారి పాలనలో భారతీయ విద్యావిధానం సమూలంగా మార్చబడింది. విద్యలో భారతీయ మూలాలకు, విలువలకు, నాగరికతా వికాసానికి, శాస్త్రీయ అవగాహనా దీప్తికి స్థానం లేకుండా పోయింది. భారతీయులు అనాగరికులనే భావన పెంచి పోషించబడింది. మనమూ నమ్మాము. మన మేధావులూ కారణాంతరాల వల్ల దానినే ప్రచారం చేసారు. విద్యాక్రమాన్ని నిర్ధారించే యంత్రాంగమూ ఆ ప్రభావాన్నుండి దూరం కాలేకపోవడం చేత అసమగ్రత చోటు చేసుకున్నది. దానికి ప్రభుత్వాలూ సహకారం అందించాయి. స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో దశాబ్దాల తదుపరి విద్యావిధానంలో మార్పులు రావాలని పెద్దలు ఆలోచన చేయడం, దానికి అనుగుణంగా వేసిన కమిటీ దాదాపు 35

సంవత్సరాలు వివిధ సంస్థలు, వ్యక్తులతో మాట్లాడి, ప్రజల నుండి సలహాలు, సూచనలు తీసుకొని ఒక నివేదికను సమర్పించడమూ, ఆ నివేదిక మంత్రివర్గ ఆమోదాన్ని పొందడం ఆదరణీయ పరిణామంగానే భావించాలి. ఇది నిజానికి ఈ విద్యా సంవత్సరం (2020-21) నుండి అమలు కావాలి. కాని కోవిడ్ 19 కారణంగా, ఇంకా అది చట్టరూపంలో రాకపోవడం చేత, విధివిధానాలను రూపకల్పన చేయక పోవడం చేత ఇంకా ఆచరణలోకి రాలేదు. అయితే దీనిపై అన్ని వర్గాల ప్రజలలో విస్తృతంగా చర్చ జరుగుతున్నది.. అది ఆదరణీయ పరిణామం.

మేమెవరమూ.. ఏం చేస్తున్నాము....

ఈ నేపథ్యంలో భారత భారతి సాహితీ సంస్థ శ్రీ నారుమంచి అనంత కృష్ణ, హైకోర్ట్ న్యాయవాది గారి ఆధ్వర్యవంలో, సామాజిక బాధ్యతగా చర్చా వేదికను నిర్వహిస్తున్నది. కోవిడ్ నేపథ్యంలో వ్యక్తిగత సామాజిక బాధ్యతగా జూలై నెల 27 వ తేదీన చేపట్టిన చర్చావేదిక తదుపరి కాలంలో జాతీయ విద్యావిధానంపై సమర్పించబడిన ముసాయిదాపై చర్చగా పరిణామం చెందింది. గత 5 వారాలుగా పలు అంశాలు ఈ చర్చలో చర్చించబడ్డాయి. విద్యావేత్తలు, విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్తలు ఈ చర్చలో భాగస్వాము లయ్యారు. ఈ చర్చలో కోవిడ్ వల్ల సంభవించిన పరిణామాలుగా ముఖ్యంగా....

1) మనుషుల మధ్య సామరస్యత కొరవడడం

2) ఒకరి వృత్తిలోకి మరొకరు ప్రవేశించడం ...

3) పల్లెలు, పట్టణాలలో వృత్తి నిపుణుల కొరత

4) విద్యారంగంపై ప్రభావం..... ముఖ్యంగా అందరినీ ఉత్తీర్ణులను చేయడం వల్ల విద్యార్థులకు డిగ్రీలు వస్తాయే కాని అవసరమైన విజ్ఞానం కాని, నైపుణ్యాలు కాని రావు.

5)విద్యా విధానంలో మూల్యాంకన విధానం గాని, మానిటరింగ్ సిస్టం కాని, ప్రక్రియలలో నవ్యత, వ్యవస్థాపరమైన నియంత్రణ చర్యలు ఇవన్నీ కుప్పకూలడంతో వీటిని పునర్నిర్మించడంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం

6) పని ఉన్నది, పని చేయగలిగిన వారూ ఉన్నారు కాని వారిలో అవసరమైన నైపుణ్యాల లేమి వీటిని చర్చిస్తూ....

తదుపరి నూతన జాతీయ విద్యా విధానం ప్రకటింపబడడం వల్ల ఆ వైపు చర్చించడం జరిగింది. ఇందులో పాత క్రొత్త విద్యావిధానంలో ఉండే భేదాలు.. మారవలసిన అంశాలు.. ప్రాతిపదికగా పెద్దలు వ్యక్తపరచిన అభిప్రాయాలను కొన్ని మీతో ఇక్కడ పంచుకుంటున్నాము.

అ) విద్య వల్ల తల్లిదండ్రులు, సమాజం కోరుకునేది ?

1) ఏ విద్యార్థి యైనా తన కాళ్లపై తాను నిలవగలననే నమ్మకంతో పాఠశాల నుండి బయటకు రావాలి

2) విద్య, సామర్థ్యాన్ని పెంచేదిగా ఉండాలి... ఆలోచనలో వైవిధ్యం కనిపించాలి

3) విద్య వల్ల భారతీయత, భారత దేశం పట్ల సరైన అవగాహన రావాలి

4) శాస్త్రీయ ఆలోచనా విధానం విద్యార్థిలో పెరగాలి.. విశ్వాసాలకు అంధ విశ్వాసాలకు మధ్య భేదాన్ని గుర్తించగలగాలి

5) తల్లిదండ్రులు సమాజం పట్ల విద్యార్థికి ఒక Concern కలగాలి

6) సాధికారిక విద్యావేత్తయై సమాజాన్ని ప్రగతివైపు నడిపించే వ్యక్తిత్వం అలవడాలి

ఆ) ఈ భావన క్రొత్త జాతీయ విద్యావిధానంలో వ్యక్తమౌతుందా?

1) క్రొత్త జాతీయ విద్యా విధాన పత్రము ఒక దార్శనిక పత్రంగానే ఉన్నది కాని అమలులో ఉండే సాధక బాధకాలు పరిగణలోకి తీసుకున్నట్లు కనిపించలేదు.

2) మన వద్ద గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉన్నాయి. వాటిలోని పాఠశాలలలో చదివే విద్యార్థులు దిగువ మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి, ఉన్నత ఆదాయ వర్గాల పిల్లలు ఉంటారు.. వారందరిలో ఒకే

విధమైన విద్యా సామర్థ్యాలు ఎలా సాధ్యపడతాయి?

3) మాతృభాషలో విద్యాబోధన జరుగుతుంది... ఉదాహరణకు ఒక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి పిల్లలు ఏ గుజరాత్ లో ఒకటో తరగతి చదివి తమిళనాడుకు వస్తారు.. వారికి ఇక్కడ గుజరాత్ లో బోధించరు.. నెమ్మదిగా తమిళానికి అలవాటుపడే లోపు ఏ తెలంగాణకు ట్రాన్స్ ఫర్ అయితే మళ్ళీ తెలుగు నేర్చుకోవడం సాధ్యపడుతుందా...

4) పల్లెలలో ఉండే విద్యార్థులకు భాషపైన పట్టు లేకపోవడం వల్ల Dropout గా మిగిలిపోయే ప్రమాదం ఉన్నది. ఆ సమస్యను ఎలా అధిగమించగలము.

విడుదల అయిన డాక్యుమెంట్ లో వీటిపై స్పష్టత లేదు. అయితే ఇది ఒక విజన్ డాక్యుమెంట్ మాత్రమే కాబట్టి వివరాలు చట్ట సభ ఆమోదం తదుపరి అమలు విధానంతో ప్రకటితమవవచ్చు.....

ఇ) గత 6 వారాలుగా చేస్తున్న చర్చల సారాంశంగా మనం చెప్పదలచినది ఏమిటి?

1) మొత్తం విద్యావిధానం అంతా కేంద్రప్రభుత్వ ఆధీనంలో ఉంటే ఒకే నిర్ణయం దేశం అంతా అమలుచేయడం సాధ్యపడుతుంది

2) అధికార వ్యవస్థ, పర్యవేక్షణ విధానం (Monitoring System) పటిష్టంగా ఉండే విధంగా అవసరమైన మార్పులు చేయాలి.

3) వీలైన మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

4)తప్పనిసరిగా ఉపాధ్యాయులకు వృత్తి శిక్షణ నందించాలి. అయితే ఉపాధ్యాయులు చాలా మంది 50 సంవత్సరాలకు దగ్గరలో ఉన్నవారే. వారు ఎప్పుడో నేర్చుకున్న దానిని అప్ డేట్ చేసుకున్న వారు చాలా తక్కువమంది ఉంటారు. దానికి తోడు క్రొత్తది అనగానే రిజెక్షన్స్ ఉంటాయి... వీటిని అడ్రస్ చేసే విధానాన్ని ఏర్పాటు చేయాలి. వారికి వారి నైపుణ్యాలు పెంచుకునే శిక్షణా అవసరమే. దానికి తగిన ప్రణాళికలు రావాలి

5) విద్యార్థులకు డిటెన్షన్ విధానం అమలు గావాలి.

6) ప్రతి ఉపాధ్యాయుడు తన విజన్ డాక్యుమెంట్ ను ప్రకటించాలి. అందులో కాల నిర్ణయం తప్పనిసరిగా వ్రాయాలి. ఒకవేళ ఆ లక్ష్యాన్ని చేరకపోతే అమలు చేయబోయే శిక్ష ఏమిటో తెలియాలి

7) ఉపాధ్యాయులకు వారి వృత్తికి అవసరం కాని అదనపు పనుల/బాధ్యతల నుండి విముక్తి నివ్వాలి

8) ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించే విధానంపై స్పష్టత కావాలి

9) ఫీజుల వసూళ్ళు, ఉపాధ్యాయుల వేతనాలు, గ్రాట్యుటీ లాంటి వాటిపై సరైన పర్యవేక్షణ యంత్రాంగం కావాలి

10) Perform or Perish అనే సూత్రం అమలు కావాలి

ఇదే విధానం యూనివర్సిటి విద్యలో కూడా అమలు కావాలి...

అదనంగా...

1) Curriculum Development including Evolution & Design పై సరైన అనుభవం, అవగాహన కలిగిన వారితో కమిటీలు వేసి నిర్ణయించాలి

2) Content చాలా ముఖ్యమైనది. దానిపై శ్రద్ధ అవసరం

3) Teaching Methodology ఇదివరకు ఎలా ఉన్నది... క్రొత్త విధానంలో ఎలా ఉండాలి. New Techniques ఎలా నిర్ణయింపబడాలి ఎలా అమలు చేయాలి... స్పష్టత ఉండాలి.

4) Subject Experts Committees ఏర్పరచాలి వాటిలో Counselling Experts స్థానం కలిగించాలి. Counselling Experts పాఠశాల స్థాయిలో కూడా అవసరమే.

5) Quality output పై దృష్టి పెట్టాలి. అలాగని ప్రక్రియను (Process) విస్మరించవద్దు. దానికి సంబంధించిన Examination pattern పూర్తిగా మార్చాలి

6) Merit based Education కావాలి. దానికై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

(ఇంకా వుంది)

పదమూడవ రాష్ట్రపతి

# ప్రణబ్ ముఖర్జీ



పాలెపు బుచ్చిరాజు

ప్రణబ్ ముఖర్జీ 1935వ సంవత్సరం డిశంబరు నెల 11వ తేదిన జన్మించాడు. ఆయన స్వస్థలం బెంగాల్ లోని బీర్ భూమ్ జిల్లాకి చెందిన 'మిరాతి' అనే గ్రామం. తండ్రి పేరు కామదా కుమార్ ముఖర్జీ. తల్లి రాజ్యలక్ష్మి ముఖర్జీ. కామదా కుమార్ ముఖర్జీ అప్పటికే కాంగ్రెసు పార్టీలో సభ్యుడు. స్వాధీనతా సమరంలో పాల్గొని సుమారు పది సంవత్సరాల పాటు జైలులో గడిపినవాడు.


తండ్రి దేశ భక్తుడు, కాంగ్రెస్ పార్టీలో ముఖ్య కార్యకర్త అయి ఉండగా ఆ ఇంటిలో పుట్టి పెరిగిన ప్రణబ్ ముఖర్జీ మరొకలా ఎలా ఉండగలడు? చిన్నప్పటినుంచి తండ్రి దగ్గర దేశభక్తి కథలు విని విని ప్రణబ్ దా కూడా స్వదేశం పట్ల భక్తి భావం, కాంగ్రెసు అంటే ఆదరణా అలవర్చుకున్నాడు. వంగ భూమి మొదటి నుంచి విప్లవకారులకి ఆలవాలం. అక్కడి ప్రజలు అన్యాయాన్ని, అక్రమాల్ని ఎదిరించి పోరాడే మనస్తత్వం కలవారు. స్వాతంత్ర్యపోరాటంలో మహాత్మా గాంధి నేతృత్వంలో అహింసాయుత ఉద్యమం ఒకప్రక్క సాగుతున్నప్పటికీ బెంగాల్ లో ఆంగ్లేయుల పాలనని నిరసిస్తూ విప్లవం చెలరేగుతూనే ఉంది. బెంగాల్ లో ఉద్భవించిన ఎందరో విప్లవ కారులు ఆంగ్లేయుల కొరడా దెబ్బలు, లాఠీల దెబ్బలు తిన్నారు. ఆస్తి పాస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణ త్యాగం చేశారు. ఆ విధంగా విప్లవ కారుల ప్రభావం కూడా ఆయనలో ఉండేది. ఏమైనా దేశంకోసం తనని తాను అర్పించుకోడానికి ఆయన



సంకల్పించుకునే ఉన్నాడు. ఆయన విద్యా ప్రారంభమే ఒక పెద్ద విప్లవంతో ఆరంభం అయింది. అది మరువలేనిది. ప్రణబ్ దా కుటుంబం నివాసం ఉండే మిరాతి గ్రామం చాలా చిన్నది. ఉన్న ఊరిలోనే నామమాత్రంగా ఉన్న ఒక చిన్న బడిలో చదువుకి పడేశారు ఆయన్ని. రెండో తరగతి లోకి వచ్చే సరికి ఆయనకా బడి నచ్చ లేదు. కాస్త దూరంలో ఉన్న 'కిరనాహర్' అనే పట్నం లో నడిచే 'శిబ్ చంద్ర స్కూల్' లోనే చదువుతానని పట్టు పట్టాడు. ఎవరెంత చెప్పినా తన పట్టు వీడలేదు. 'సరే అలాగే చేద్దా'మని పెద్దలు అనుకున్నా అది సాధ్యపడే పనికాదు. ఎందుకంటే, ఆ బడిలో చదువు ఐదో క్లాసు నుంచి ప్రారంభం అవుతుంది. సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. కాని 'అదంతా నాకు తెలియదు. నేను ఆ బడిలోనే కాని మరెక్కడా చదవను' అని భీష్మించుకుని కూర్చున్నాడు. చేసేది లేక వెళ్లి ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడితో విషయం చెప్పిమొరపెట్టుకున్నార. ఆయన 'సరే. అతనికి అయిదోక్లాసు చదవగల పరిజ్ఞానం ఉందా లేదా అని ఒక పరీక్ష పెట్టి అందులో పాసయితే తీసుకుంటాను' అని ఒప్పుకున్నాడు. అందరూ ఆశ్చర్య పోయేలా ప్రణబ్ ఆ పరీక్షలో భేషుగ్గా పాసయ్యాడు. ఇంక ఆ బడికి పంపడానికి ఆటంకం లేకపోయింది. కాని మరొక సమస్య వచ్చి పడింది. ఆ ఊరు తలిదండ్రులు ఉండే



గ్రామానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత చిన్న పిల్లవాడు బాడి బురద మయంగా ఉండే దారిలో రోజూ నడుచుకుంటూ వెళ్లి ఎలా చదవగలడా అని నిరాశ చెందారు. కాని తన పంతం నెగ్గించుకున్న ప్రణబ్ దా ఏమాత్రం వెనుకంజ వేయలేదు. ఒక గావంచా కట్టుకుని వర్షంలో కూడా తడుస్తూ, నడిచి వెళ్లి , అక్కడ ఒక మాస్టారి ఇంట్లోకాళ్ళు కడుక్కుని, బట్టలు మార్చుకుని, బడికి వెళ్ళేవాడు. ఆయన పట్టుదల సాహసం అటువంటివి. తరవాతి కాలంలో ఆయన గొప్పవాడైనాక స్వగ్రామం నుంచి, ఆ ఊరికి పక్కా రోడ్డు వేయించి, తన తండ్రి పేరు పెట్టాడు. అది వేరే విషయం. ప్రణబ్ ముఖర్జీ జీవితంలో మరొక ముఖ్యమైన విషయం, ఆయనకి చాక్లెట్లు అంటే మహా ఇష్టం. అవకాశం దొరికితే చాలు ఓ చాక్లెట్ నోట్లో వేసేసుకోడమే! ఇది చిన్నతనానికే అయితే పరిమితం అయితే గొప్ప కాదు. ఆయన గొప్ప రాజకీయ వేత్త అయి, దేశానికి రాష్ట్రపతి అయ్యాక కూడా అది కొనసాగిందని



అంటారు. కోటుజేబులో ఎప్పుడు వెతికినా చాక్లెట్లు తప్పకుండా దొరికేవట! బాలుడిగా కామిక్స్ చదవడానికి కూడా ఇష్ట పడేవాడు. ముఖ్యంగా 'చాచా చౌదరి' చదివేవాడట. ప్రణబ్ దా ఉన్నత విద్యాభ్యాసం, సూర్య విద్యాసాగర్ యూనివర్సిటిలోను, కలకత్తా యూనివర్సిటిలోను జరిగింది. పోలిటిక్సులో ఎం. ఏ. చదివి, న్యాయశాస్త్రం లో పట్టా పుచ్చుకున్నాడు. రాజకీయాల్లో చెరక ముందు ఆయన కొంతకాలం ఎ. జి. ఆఫీసులో గుమాస్తాగా పని చేశాడు. ఒక కాలేజిలో ఉపాధ్యాయుడిగా చేశాడు. రాకీయాల్లో ప్రవేశించి ఉండక పోతే ఆయన తనకి బాగా నచ్చిన ఈ వృత్తిలోనే స్థిరపడి ఉండేవాడు. కాని విధి నిర్ణయం మరొకలా ఉంది. కొంతకాలం అయన బెంగాలీ పత్రిక 'దేశర్ డాక్' లో విలేకరి గా కూడా పని చేశాడు. అంటే కాక మంచి రచయిత కూడా. తనకున్న రాజకీయ పరిజ్ఞానంతో ఎన్నో పుస్తకాలు రాశాడు. అందుకే ప్రణబ్ ముఖర్జీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని చెప్పవచ్చును. అయినపట్టికీ తండ్రి రాజకీయవేత్త కాబట్టి ఆఖరికి ఆయన మనసు అటువైపే మొగ్గింది. ఆ విధంగా, తన స్వంత రాష్ట్రమైన బెంగాల్ లోఎన్నికల సమయంలో తన అనుభవాన్ని, తండ్రి దగ్గర నేర్చిన యుక్తుల్ని ఉపయోగించి చాలా ప్రముఖమైన పాత్ర వహించాడు. ఆయనలో చురుకు తనాన్ని గ్రహించిన కాంగ్రెసు ఆయన్ని ఒక ఆవిర్భవిస్తున్న నాయకుడిగా గుర్తించడంలో ఆలస్యం చేయలే దు. ముఖ్యంగా కృష్ణమినన్ మిడ్నాపూర్ నుంచి పోటీ చేసినపుడు ప్రణబ్ చేసిన కృషి, ప్రచారం అప్పటి ప్రముఖ కాంగ్రెసు నేత ఇందిరా గాంధిని ఎంతగానో ఆకర్షించాయి. ఈ నేత చాలా సమర్థుడని, పార్టీలో ఉండవలసిన వాడని ఆమె అప్పుడే గ్రహించింది. అనువైన సమయంకోసం ఎదురు చూసి, ఒక శుభ ముహూర్తాన ఆయన్ను రాజ్యసభ సభ్యుడిగా చేసింది. ఉన్నట్టుండి అంతటి విశేష మర్యాద తనకి ఇచ్చినందుకు ప్రణబ్ జీవితాంతం ఆమెకు ఋణపడి ఉన్నాడు. అప్పటినుంచి ఆమె కనుసన్నలలో మెలగ సాగాడు. ఆమె మనస్తత్వాన్ని, నడవడిని బాగా అర్థం చేసుకున్నాడు. ఆమె మనసులో ఏముందో, ఏమి చేయాలనుకుంటోందో క్షణంలో గ్రహించి, ఆమె నోటితో చెప్పకుండానే ఆమె ప్రమేయం

లేకుండానే, రెప్ప పాటులో వాటిని ఆచరణలో పెట్టేవాడు. ఆయనలోని ఆ ప్రతిభకు ఆశ్చర్యపడడం ఇందిరా గాంధి వంతు అయ్యేది. గొప్ప పనులు చేయాలని, పేరు ప్రతిష్టలు సంపాదించాలని ఆయనలో ప్రబలమైన కోరిక ఉండేది. దేశంలో గోప్పనాయకుడు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కుమార్తె అయిన ఇందిరా గాంధి సమక్షంలో అది నాలుగింతలు అయింది. అహోరాత్రాలు కృషి చేస్తూ కాంగ్రెసు పార్టీలో పేరు ప్రఖ్యాతులున్న నాయకులకి కొద్దికాలం లోనే ఆత్మీయుడు అయ్యాడు. దానికి ఫలితంగానే 1973వ సంవత్సరంలో ఆయన కేంద్ర ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి అయ్యాడు. అది ఆయనకు ప్రభుత్వంలో లభించిన మొదటి ఉన్నత పదవి. కేవలం 42సంవత్సరాలకే కేంద్రంలో మంత్రి పదవిని పొంద గలిగినందుకు ఆయనకు ఎంతో గర్వంగా ఉండేది. శ్రమించి పని చేసేవారు ఎవరైనా రాజకీయాల్లో ఎదగ గలరని విశ్వసించాడు. ఇందిరా గాంధి 1975 వ సంవత్సరంలో ఎమర్జెన్సి పెట్టినప్పు ఆమెను నిస్సంకోచంగా సమర్ధించాడు. కఠినమైన సమయంలో ఆమె స్థైర్యానికి అండగా నిలిచినా మూల స్తంబాలలో ప్రణబ్ ముఖర్జీ ముఖ్యుడు. ప్రజలేమనుకుంటారో, తన భవిష్యత్తు ఏమౌతుందో అని కూడా ఆలోచించకుండా ఆమెకు



చేయూతనిచ్చాడు.ఈసంఘటన తరవాత ప్రణబ్ ముఖర్జీ ఇందిరా గాంధికి అంతరంగికులలో ఒక డయ్యాడు. ఆ కారణంగా జనతా పార్టీ పాలనలో దోషిగా కూడా పరిగణించ బడ్డాడు.ఇందిరా గాంధి 1982 వ సంవత్సరంలో ప్రభుత్వాన్ని ఏర్పరచినప్పుడు, కేంద్రంలో విత్తమంత్రి పదవి దక్కించుకున్నాడు. ఆ పదవీకా లంలో ఆర్థికపరమైన ఎన్నో మార్పులు తీసుకువచ్చాడు. విదేశాల్లోని ఆర్థికసంస్థలు సైతం, ప్రణబ్ చేస్తున్న సంస్కరణల్ని ఆదరించి, దేశ పారిశ్రామికాభి వృద్ధిలో తోడ్పడడానికి ముందు కు వచ్చాయి. ఆయన సేవల్ని గుర్తించిన 'యురో మని' అనే ఒక విదేశీ పత్రిక ఆయన ప్రపంచంలోనే ఉన్నతమైన ఆర్థిక మంత్రిగా పొగిడింది. కాంగ్రెసు పార్టీలో ఆయన స్థానం ఎంత వరకు ఎదిగిందంటే, ఇందిరమ్మ తరవాత ఎవరు అంటే, ప్రణబ్ పేరు వినిపించేది. అదే కొందరిలో అసూయకి కూడా కారణం అయింది. దురదృష్టవశాత్తు ఇందిరా గాంధి 1984వ సంవత్సరంలో హత్యా గావించ బడింది. ప్రణబ్ ముఖర్జీ ఆ స్థానాన్ని ఆక్రమించడం ఇష్టం లేని కొందరు దానికి బంధం వేయడానికి ప్రధాన మంత్రి పదవి నెహ్రూ కుటుంబంలోనే ఉండాలనే నెపంతో రాజీవ్ గాంధి పేరు ప్రతిపాదించారు. అసలాయనకు అప్పట్లో రాజకీయాలలో ప్రవేశం లేదు. అయినా బలవంతాన ఆ పద విని ఆయనకు కట్ట బెట్టారు. అప్పటికే ప్రణబ్ దా సత్తా తెలిసిన రాజీవ్ గాంధి తన పదవి నిలబెట్టుకోవడం కోసం, ఆయన్ని పూర్తిగా ప్రక్కన పెట్ట సాగాడు. రాజకీయంగా ఉపేక్షించ సాగాడు. అది కనిపెట్టిన ప్రణబ్ హితైషులు కొందరు, ఆయన్ని కాంగ్రెసు నుంచి విడిపోయి స్వంత పార్టీ పెట్టమని ఒత్తిడి తీసుకురా సా గారు. అప్పటికి

బెంగాల్ లో కాంగ్రెసు పార్టీ ఉనికి అంతంత మాత్రమే. అయినా ప్రణబ్ దా 1986వ సంవత్సరంలో కాంగ్రెసు నుంచి రాజీనామా చేసి, 'రాష్ట్రీయ సామాజిక కాంగ్రెసు' పేరిట కొత్త పార్టీని స్థాపించాడు. ఆ పార్టీ ప్రనబ్నాయకత్వంలో వెళ్ళు పెంచుకుంటున్న సమయంలో, కొందరు నేతల సలహా మేరకు, రాజీవ్ గాంధి ఆహ్వానం మీద తన పార్టీని 1989వ సంవత్సరం లో కాంగ్రెసులో విలీనం చేశా డు. అయితేనేం, 1991వ సంవ త్సరంలో రాజీవ్ గాంధి హత్యా గావింప బడడంతో పార్టీలో తిరిగి పతనం ప్రారంభం అయింది. కాని, పి.వి, నరసింహారావు అధ్వర్యంలో మునుగుతున్న నావ ఒడ్డుకు చేరింది. ప్రణబ్ ప్రతిభను బాగా తెలిసిన నరసింహారావు ప్లానింగ్ కమిషన్ కి చైర్మన్ గా నియమించిగౌరవించాడు.తరవా త విదేశీమంత్రిత్వ శాఖను కూడా సమర్థవంతంగా నిర్వహించాడు. సోనియా గాంధీతో కలిసి అతి క్లిష్టమైన పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని నడపడంలో ముఖ్యపాత్ర వహిం పార్టీలో అంతర్గతంగాను, విపక్ష పార్టీలతోను వచ్చే విభేదాల్ని సునాయాసంగా పరి ష్కరించడంలోను.

ప్రణబ్ముఖర్జిలోని ప్రతిభా విశేషాల్ని గుర్తించి ఇందిరాగాంధి రాజ్యసభ సభ్యుడిగా చేసి కేంద్ర మంత్రి మండలిలో స్థానం కల్పించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో అతి ముఖ్యమైన సోపానం. ఆ సందర్భంలో 1969 వ సంవత్సరంలో ఆయనకి ప్రభుత్వ నివాసంగా ఒక భవనం కేటాయించారు. ఆ భవనం రాష్ట్రపతి నివాసానికి దగ్గరలో ఉండేది. నిత్యనూతనంగా ఆలం కరించబడిన గుర్రపు బగ్గీలో అప్పటి రాష్ట్రపతి ప్రయాణించడం, ఆ భవనం వైభోగమూ చూసి ఆశ్చర్య చకితుడై, తన అక్కగారైన అన్నపూర్ణతో, "అటువంటి ఔన్నత్యం పొందాలంటే, నేను వచ్చే జన్మలో ఆ బగ్గీనిలాగే గుర్రంగా పుట్టాలేమో!" అని చమత్కరించాడట. అందుకామె ఏమీ తడుముకోకుండా, "నిజమైన కార్య దీక్షా, పట్టుదలా ఉంటే, వచ్చేజన్మలో ఏం ఖర్మ, ఈ జన్మలోనే ఆ గుర్రాలు లాగే బగ్గీనే ఎక్కే తాహతు సంపాదించ గలవు" అని సమాధానం చెప్పిందట. పైన దేవతలు "తథాస్తు" అని ఉంటారు. ఆ కల సాకారం అయింది.

ప్రణబ్ముఖర్జీలో అన్నిటినీ మించి ఉన్న మరొక సుగుణం, మానవత్వం. ఒకసారి ఆయన కారులో ప్రయాణిస్తూ ఉండగా, ఆ కారు ఒక సైకిలు నడిపే వ్యక్తిని ఢీకొట్టింది. పాపం ఆ మనిషి క్రింద పడిపోయాడు. సైకిలు చిత్తు అయిపోయింది.. అది చూసిన చుట్టుప్రక్కల వాళ్ళు అంతా అక్కడ గుమిగూడి ఆయన్ని తిడుతూ, కారు మీద రాళ్ళు రువ్వసాగారు. ఆయన క్రిందికి దిగి ముందుగా ఆ వ్యక్తిని హాస్పిటల్ కి చేర్చడం అవసరం అని వాళ్లకి నచ్చాజెప్పజుశాడు. కాని వాళ్ళు ఆయనని కదలనీయ లేదు. చాలా వాదనలు అయిన తరవాత ఆఖరికి ఆయన అక్కడే ఉండి డ్రైవరు మాత్రం గాయపడినవాడిని తీసుకు వెళ్లేందుకు ఒప్పుకున్నారు. ఆ తరవాత మాటల సందర్భంలో ఆయన ఎవరో తెలుసుకుని, వాళ్ళంతా శాంతించారు. ప్రణబ్ దా ఆ గాయపడిన వాడికి వైద్యం చేయించడమే కాక, ఒక క్రొత్త సైకిలు కూడా కొని ఇచ్చాడు.

జీవితంలో ఎన్నో బాధ్యత లు నిర్వహిస్తూ కూడా ఆయన ఎప్పుడూ ఆధ్యాత్మిక చింతన మాన లేదు. బెంగాలీలకి దసరా ల్లో దుర్గాపూజ అతి ముఖ్యమైన పండగ. ఆయన ప్రతి సంవత్స రమూ పూజా రోజుల్లో తన స్వగ్రామం వెళ్లి ఉత్సవాల్లో పాల్గొనే వాడు. అక్కడి ప్రజలతో కలిసి మెలిసి తిరిగేవాడు. ఏమాత్రమూ భేషజం లేని మనిషి ప్రణబ్ దా.

ఒక సామాన్య కుటుం బంలో పుట్టి పెరిగి అంతటి ఉన్నత శిఖరాలకి ఎదిగిన ప్రణబ్ ముఖర్జీ మనదేశపు రాష్ట్రపతి కావడంలో వింత ఏముంది? ఈ మధ్యనే 2019 వ సంవత్సరంలో ప్రభుత్వం ఆయన్ని దేశంలోనే అత్యున్నత బిరుదు "భారత రత్న" తో సన్మానించింది.

పట్టుదల, కార్యదీక్షా ఉన్న వారు ఎంత కష్టతరమైన దానినైనా సాధించగ లరు అన్నదానికి ప్రణబ్ ముఖర్జీ జీవితం ఒక ఉదాహరణ.

# గ్రీసు దేశపు పురాణ గాథలు

## వేమూరి వేంకటేశ్వరరావు



**“Knowledge is acquired when we succeed in fitting a new experience into the system of concepts based upon our old experiences. Understanding comes when we liberate ourselves from the old and so make possible a direct, unmediated contact with the new, the mystery, moment by moment, of our existence.”**
**Aldus Huxley. “Knowledge and Understanding”**


## ముందు మాట

నేను ఈ వ్యాసాలు రాయడానికి ప్రేరణ కారణం ఒక విమాన ప్రయాణం. భారత దేశం వెళుతూ, శేన్ ఫ్రాన్సిస్కో లో ఉదయం 8 గంటలకి బయలుదేరి, నూ అర్క్ చేరునేసరికి సాయంత్రం అయిదు అయింది. పరుగుబాట మీదకి దిగడానికి విమానం సంసిద్ధం అవుతూ ఉండగా, “మనం దిగబోయే పరుగుబాట మీద మరొక విమానం ఉంది. కంట్రోలు టవర్ లో ప్రజలు నిద్రపోతున్నట్లు ఉన్నారు. మరో చుట్టు తిరిగి వస్తాను. అరగంట సేపు ఓపిక పట్టండి,” అని చోదకుడు విమానం జోరు పెంచుతూ పైకి లేచేసరికి ఇహ చేసేది ఏమీ లేకపోవడంతో నా కుర్చీకి ఎదురుగా ఉన్న టి.వి. లో ఏదైనా “ఇరవై నిమిషాల కార్యక్రమం” చూద్దామని వెతకడం ఉపక్రమించేను. “అపస్వరం అనే ఏపిల్ పండు కథ” ట. పదిహేను నిముషాలు ట. చూడడం మొదలు పెట్టేను.
పురాతన గ్రీసు దేశపు కథ. ఇంతకు పూర్వం నేనెప్పుడూ ఈ కథ గురించి వినలేదు. ఆసక్తితో చూసేను. గమ్యం చేరుకోగానే గూగుల్ లో వెతికేను. చాల ప్రాచుర్యం ఉన్న కథ. మా అమ్మాయిని అడిగితే, “చిన్నప్పుడు హైస్కూల్ లో చదివేను” అని చెప్పింది. నేను పుస్తకాల పురుగుని అయినా ఈ కథ నా కళ్ళ పడడానికి ఎనభై ఏళ్ళు పట్టిందంటే ఈ కథని వినని వాళ్ళు ఇంకా ఎంతమంది ఉంటారో అనిపించింది. ఈ కథ గురించి పరిశోధన చేస్తూ ఉంటే ఆసక్తికరమైన అంశాలు ఎన్నో తెలుసుకున్నాను. వాటన్నిటిని క్రోడీకరించి వ్యాసాలుగా రాసేను.
ఇక్కడ ఉటంకించిన అంశాలన్నిటినీ కేవలం ఒక నఖచిత్రంలా స్పర్శించినా ఇది పెద్ద గ్రంథం అవుతుంది. అందుకని కొన్ని ముఖ్యమైన అంశాలని మాత్రమే ముచ్చటించేను.
వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజంటన్, కేలిఫోర్నియా
2020

# 2. గ్రీకు పురాణ గాథలు: ఒక పరిచయం

ఆధునిక పాశ్చాత్య నాగరికత యొక్క పునాదులు గ్రీసు దేశంలో కనిపిస్తాయి. ఆర్కిమిడీస్, పైథాగరోస్, సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి ఆద్యులకి గ్రీసు దేశం పుట్టినిల్లు. ఆధునిక శాస్త్రాల మీద గ్రీసు దేశపు ప్రభావం అడుగడుగునా కనిపిస్తూనే ఉంటుంది. అంతే కాదు. పాశ్చాత్య సాహిత్యం మీద, శిల్పాల మీద, తైలవర్ణ చిత్రాల మీద, సినిమాల మీద, ఆటల మీద కూడా గ్రీసు దేశపు పురాణ గాథల ప్రభావం మెండు. కనుక గ్రీసు దేశపు పురాణ గాథలపై అవగాహన మనకి ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. మౌర్య సామ్రాజ్యపు రోజుల నుండి భారత దేశం మీద గ్రీసు ప్రభావం మెండుగా ఉందనే చెప్పాలి. ఈ సందర్భంలో గ్రీసు మీద భారతదేశపు ప్రభావం ఏమైనా ఉందా అన్న విషయం కూడా ఆలోచించవలసిన అంశమే!

గ్రీసు దేశపు పురాణ గాథలు చదువుతూ ఉంటే వాటికీ హిందూ పురాణ గాథలకి మధ్య పోలికలు కనిపిస్తూ ఉంటాయి. ఈ పోలికలు పేర్లలో కావచ్చు, సంఘటనలలో కావచ్చు, వ్యక్తుల ప్రవర్తనలో కావచ్చు, దేవతల ఆయుధాలలో కావచ్చు, దేవతల వాహనాలలో కావచ్చు, దేవతలకి మానవులకి మధ్య సంబంధబాంధవ్యాల రూపేణా కావచ్చు. ఈ పోలికలకి కారణాలు రకరకాల కోణాలలో వెతకవచ్చు. కానీ హిందూ పురాణ గాథలకి, గ్రీసు పురాణ గాథలకి మధ్య మౌలికమైన తేడాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతానికి వాటన్నిటిని పక్కన పెట్టి వారి పురాణ గాథలని ఒక నఖచిత్రంలా అర్థం చేసుకుందాం.





మనకే కాదు, చాల సమాజాలలో పురాణ గాథలు ఉన్నాయి; ఈజిప్ట్, నోర్స్, గ్రీస్, వగైరా. ఈ కథలు అన్నిటిలోను ఈ ప్రపంచం ఎలా పుట్టుకొచ్చిందో, అందులో మానవుడు ఎలా ఉద్భవించేడో, రకరకాల కోణాలలో ఆవిష్కరణ జరుగుతుంది. అంతే కాకుండా దేవతలు, స్వర్గం, నరకం, మొదలైన విషయాల మీద పరిశీలన జరుగుతుంది. వీటిని సునిశితంగా పరీక్షించి చూస్తే వీటన్నిటిలోను కొన్ని పోలికలు కనిపిస్తాయి. దీనికి రెండు కారణాలు ఉండొచ్చు. ఒకటి, విభిన్న ప్రదేశాలలో, విభిన్న కాలాలలో నివసిస్తున్న మానవుల మేధలో, ఈ విశ్వం యొక్క ఆవిర్భావాన్ని గురించి పోలికలు ఉన్న ఆలోచనలు వచ్చి ఉండవచ్చు. రెండు, అనాది కాలంలో ఈ విశ్వం యొక్క ఆవిర్భావం గురించి ఒక చోట వచ్చిన మౌలికమైన ఊహా తరంగాలు నాలుగు దిశలకి వ్యాపించి, కాలక్రమేణా దేశ, కాల, పరిస్థితులకి మార్పులు చెంది, రకరకాల కథలుగా అవతరించి ఉండవచ్చు. స్వర్గం, నరకం, దేవతలు, దానవులు, మంచి, చెడు అనే భావాలకి భౌగోళిక పరిధులు ఉన్నట్లు తోచదు.

పురాతన కాలపు గ్రీసు దేశంలో ప్రజలు బహుదేవతారాధకులు. ప్రకృతిలో మనకి కనిపించే శక్తులు దేవతల ఆధీనంలో ఉంటాయని నమ్మేవారు. ఆయా దేవతలు ప్రసన్నమైతే ఆయా శక్తులు మనకి అనుకూలంగా ఫలితాలని ఇస్తాయని నమ్మేవా-

రు.

గ్రీసు దేవతలలో ఏకోదరుల మధ్య వివాహాలు జరిగితే తప్పు కాదు; అదే విధంగా తల్లికి కొడుకుకి మధ్య వైవాహిక సంబంధం కానీ, తండ్రికి, కూతురుకి మధ్య వైవాహిక సంబంధం కానీ సమ్మతమే. సృష్ట్యాదిలో ఈ రకం సంబంధాలు తప్పనిసరి. ఈ రకం సంబంధాలు మన పురాణాలలోను కనబడతాయి. దేవతలని, అమరులని మానవ లోకంలో ఉన్న విలువల పట్టకం ద్వారా విమర్శించి ప్రయోజనం లేదు. అదే విధంగా ఇరవై ఒకటవ శతాబ్దపు విలువలని, శాస్త్ర పరిజ్ఞానాన్ని గజం బద్దలా వాడి వీరిని విమర్శించి లాభం లేదు.

మన ప్రాచీన పురాణ గాథలు రామాయణ, మహాభారతాలలో ఇమిడి ఉండడమే కాకుండా మన అష్టాదశ పురాణాలలో కూడ ఉన్నాయి. ఇదే విధంగా గ్రీసు దేశానికి సంబంధించిన ప్రాచీన పురాణ గాథలు హోమర్ (సా. శ. పూ. 800) రాసిన ఇలియాడ్, ఆడెస్సి అనే గ్రంథాలలోను, హెసియోడ్ (సా. శ. పూ. 700) రాసిన థియోగొనీ లోను, వర్జిల్ (సా. శ. పూ. 20) రాసిన ఎనియాడ్ (Aeneid), వగైరా గ్రంథాలలోనూ కనిపిస్తాయి. (ఇక్కడ ఇచ్చిన తేదీలు అన్నీ సుమారుగా తీసుకోవాలి; కచ్చితంగా ఎవ్వరికీ తెలియదు. సా. శ. పూ. అంటే "సాధారణ శకానికి పూర్వం," అనగా పాత పద్ధతిలో, "క్రీస్తు పూర్వం" అని అర్థం.)




గ్రీకు పురాణాలలో కథలకి, మన పురాణ గాథలకి మధ్య ఎంత "గట్టి" పోలికలు అంటే ఒకరి నుండి మరొకరు "అనుకరించారా?" అన్న అనుమానం రాక మానదు. "ఎవరి నుండి ఎవరు?" అనే ప్రశ్న వేసుకుని అనవసరంగా ఆరాట పడే కంటే ఆ పోలికలు కొన్ని చూద్దాం.


ఉదాహరణకి మేషాది మీన పర్యంతం ఉన్న ద్వాదశ రాశులనే తీసుకుందాం. భూమి నుండి సూర్య చంద్రులని చూసినప్పుడు నేపథ్యంలో కనిపించే నక్షత్ర సమూహాలకి మన పూర్వులు మేషం, వృషభం, ...., మీనం అని పేర్లు పెట్టేరు. ఎందుకని ఈ పేర్లు పెట్టేరుట? ఆ నక్షత్ర సమూహాలు ఆయా శాల్తీల ఆకారాలలో ఆనాటి వీక్షకులకి కనిపించి ఉంటాయి. నా కంటికి ఈ ఆకారాలు అలా అనిపించలేదు. ఎక్కడో, ఎవ్వరికో ఒక నక్షత్ర సమూహం మేషం ఆకారంలోనో, వృషభం ఆకారంలోనో కనిపించి ఉండు గాక. కానీ అవే నక్షత్ర సమూహాలు అన్ని దేశాలలో అవే ఆకారాలలో కనిపించేయనడం నమ్మశక్యం కాని ఊహ. ఈ రాశి చక్రం లోని పేర్లు ఇటు నుండి అటు అయినా వెళ్లి ఉండాలి. లేదా, అటు నుండి ఇటు అయినా వచ్చి ఉండాలి. లేదా, వీటికి మూలం మరొక భౌగోళిక ప్రాంతంలో ఉండి ఉండాలి.

మరొక ఉదాహరణగా మన వారాల సంగతి చూద్దాం. మొదటగా, వారానికి ఏడు రోజులే ఎందుకు ఉండాలి? సప్తర్షి మండలం (బృహదృక్షం లేదా పెద్ద ఎలుగు) లోను, లఘు ఋక్షం లేదా చిన్న ఎలుగు) లోను ఏడేసి నక్షత్రాలు ఉండడము వల్ల ఏడుకి కొంత ప్రత్యేకత వచ్చి ఉండవచ్చు. ఆకాశంలో కదులుతూ, స్ఫుటంగా కనిపించే నభోమూర్తులు - అనగా, సూర్యుడు, చంద్రుడు, బుధ, శుక్ర, కుజ, గురు, శని గ్రహాలు - ఏడు కావడం మరొక కారణం కావచ్చు. ఆ రోజుల్లో కృత్తికలో ఏడు నక్షత్రాలు ఉండడం (ఇప్పుడు ఆరే ఉన్నాయి!)


ఏడుకి ప్రత్యేకత వచ్చి ఉండవచ్చు. లేదా, చాంద్ర మాసంలో 28 రోజులు కనుక అందులో నాలుగు వారాలు సరిగ్గా ఇముడుతాయి కనుక వారానికి ఏడు రోజులు ఉంటే లెక్కకి సదుపాయంగా ఉంటుంది కదా!

ఇక వారాల పేర్లు చూడండి. ఇంగ్లీషులో మనం వాడే వారాల పేర్లు అకాశంలో కనిపించే గ్రహాల పేర్లని ఆధారంగా చేసుకుని గ్రీసు దేశంలో పెట్టినవి. వాటిని సంస్కృతంలోకి అనుసృజన చేసి పెట్టిన పేర్లే మనం ఇప్పుడు వాడుతున్నవి అని నా నమ్మకం. (రవి, చంద్ర, మంగళ (ఏరిస్), బుధ (హెర్మీస్), గురు (జూస్), శుక్ర (ఎఫ్రొడైటి), శని (క్రోనోస్). గ్రీసు, రోమక పురాణ గాథలలో వీటి వెనుక చాల లోతైన కథలు ఉన్నాయి. మన వారాల పేర్లకి, మన పురాణ గాథలకి మధ్య లంకె ఉందేమో కానీ నాకు కనబడ లేదు.

“వేదకాలంలో ఏడు వారాల భావన (concept) లేదు. మనకు తిథులు, మాసాలు మాత్రమే




తెలుసు. తిథుల గురించి, నక్షత్రాల గురించి విపులంగా ఉన్న ప్రాచీన వైదిక వాఙ్మయం, వారాల గురించి రాయలేదనే చెప్పాలి. అయితే, తరువాతి కాలంలో ఏడు రోజులు, ఏడు గ్రహాలు





మనకు హోరశాస్త్రం ద్వారా, ఆ తరువాత సూర్య సిద్ధాంతం ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చాయి (హోరశాస్త్రముపై గ్రీకుల, రోమన్ల, పారశీకుల ప్రభావం ఉంది)” అంటూ సురేశ్ కొలిచాల అభిప్రాయపడ్డారు.

నక్షత్రాల పేర్లు, రాసుల పేర్లు చూసినప్పుడు కొంత సంబంధం ఉన్నట్లు అనిపించవచ్చు; కానీ ఇది మనవాళ్ళు క్లాసు పీకితే కనిపిస్తున్న సంబంధమో, నిజంగానే ఉందో ఖరాఖండిగా చెప్పడం కష్టం.

నెలల పేర్లు వచ్చేసరికి మాత్రం మన చైత్ర వైశాఖాదులకి తార్కికమైన కారణం ఉంది. పూర్ణిమ నాడు చంద్రుడు ఏ నక్షత్రంతో కలసి ఉంటాడో ఆ నెలకి ఆ నక్షత్రం పేరు వస్తుంది. ఉదాహరణకి చంద్రుడు పౌర్ణమినాడు చిత్ర నక్షత్రంలో ఉంటే ఆ నెలకి చైత్రం అని పేరు. జనవరి, ఫిబ్రవరి, వగైరాలకి ఇటువంటి సంబంధం కనిపించదు.

మనకి మేరువు పర్వతం ఉంటే వారికి ఒలింపస్ పర్వతం ఉంది. మేరువు పర్వతం చుట్టూ సప్తద్వీపములు ఉండుననియు, ఈ పర్వతం స్వర్ణమయమై దేవతలకు స్థానమై ఉండుననియు మన పురాణాలు చెబుతున్నాయి. ఒలింపస్ పర్వతం మీద వారి దేవతలు అందరూ ఉంటారు. మన దేవతలూ, వారి దేవతలూ అమరులే. మన దేవతలకి అమృతం తాగితే అమరత్వం సిద్ధించింది. వారి దేవతలు “అం-




బ్రోజియా" తింటారు, "నెక్టర్" తాగుతారు. విష్ణుమూర్తి మొహినీ వేషంలో దేవతలకి అమృతం పంచిపెడుతున్న సమయంలో కశ్యపుని పౌత్రుడైన రాహువు దేవతల వరసలో చేరి దొంగతనంగా అమృతం తాగినందుకు శిక్షగా విష్ణుమూర్తి అతని తలని తన చక్రంతో నరికినప్పుడు శిరోభాగము రాహువు గాను, మొండెము కేతువు గాను మారతాయి. గ్రీసు పురాణాలలో టెంటలస్ "అంబ్రోజియా" ని దొంగిలించి తిన్నందుకుగాను ఆకలిదప్పికలతో పాతాళంలో పడి ఉండమని శాపం పొందుతాడు.

తనకి పుట్టిన సంతానమే తన మరణానికి కారణం అవుతుందని తెలుసుకుని రేయాకి పుట్టిన ప్రతి బిడ్డని క్రోనస్ మింగేస్తాడు. చిట్టచివరికి కడసారపు బిడ్డ జూస్ ప్రాణం కాపాడడానికి రేయా కుట్ర పన్నుతుంది. ఇక్కడ శంతనుడు-గంగ కథ కానీ కంసుడు-కృష్ణ కథ కానీ గుర్తుకి వస్తుంది. ఇలా వెతికితే బాహిరంగా ఇంకా చాల పోలికలు కనిపించినా ఇలియాడ్, ఆడెస్సి వగైరాలలో కనిపించే గ్రీసు పురాణ గాథలకి రామాయణ, మహాభారతాలలోను, హిందూ పురాణాలలోను కనిపించే కథలకి మధ్య మౌలికమైన తేడాలు ఉన్నాయి. ఈ కథల ద్వారా ఈ పోలికలు, తేడాలు ఏమిటో వివరంగా తెలుసుకుందాం.

బొమ్మ: పురాణ కాలంలో గ్రీసు దేశం, పరిసర ప్రాంతాలు, దేశాలు

ఉపయుక్త గ్రంథాలు

Stephen Markel, Origins of the Indian Planetary Deities, Edwin Mellen Press Limited, 1995

https://en.wikipedia.org/wiki/Greek_mythology

మహీధర నళినీమోహన్, నక్షత్ర వీధులలో భారతీయుల పాత్ర, అవంతి ప్రచురణలు, 2-2-185 /56/10 సోమసుందర్ నగర్, హైదరాబాదు, 500 013, నవంబరు 1997

(ఇంకా వుంది)

**రచయితలకు విజ్ఞప్తి**

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంపవలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

చైతన్యం సంకల్ప బలం

**చందా రేట్లు**

విడిప్రతి రూ. 20.00
సంవత్సరానికి రూ. 200.00
పోస్ట్ ద్వారా రూ. 230.00

Please deposit your subscription in favour of
CHAITANYAM SANKALPABALAM
A/c No. 1626201002070-
Canara Bank
Kundanbagh Branch,
Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
చైతన్యం
సామాజిక విలువల మాస పత్రిక

# ప్రేమంటే ఇంతే

(గతసంచికతరువాయి)

ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



ఆయన మాట చెల్లుబాటు కాలేదని ఆయన అహం దెబ్బ తిని, ఆయన పరువు ప్రతిష్టకి భంగం వాటిల్లినట్లు భావించారు. అందుకని అక్కబావగార్ల మీద, నీ మీద కోపం పెంచుకున్నారు, దాని పర్యవసానమే నీ పెళ్ళిలో గలాటా...రెండవది ఆ గలాటాకి తానే కారణమన్న నిజం బంధువర్గంలో అందరికి తెలిసిపోవడం వల్ల ఆయనలో అపరాధ భావం నెలకొంది. అనూని మోహన్కిచ్చి పెళ్ళి చేస్తే వాళ్ళు గతం దృష్టిలో పెట్టుకొని నా పిల్లని సాధిస్తారు, నా పిల్లని అడ్డం పెట్టుకొని నన్ను సాధిస్తారు, అందుకని నా పిల్లని మోహన్కి ఇచ్చి పెళ్ళి చెయ్యను, నా పిల్లని ఆ కుటుంబంలో వెయ్యను అని భీష్మించుకుని కూర్చున్నారు. నేను ఆయనకి ఎంతో నచ్చ చెప్పాను, వేరే గోత్రం వాళ్ళతో కన్యాదానం విషయం కూడా చెప్పాను. ఎన్ని చెప్పినా ఆయన వినడం లేదు. మోహన్తో అనూ పెళ్ళి జరగాలని నాకు ఎంత అపేక్ష వున్నా, ఆయనని కాదని నేను ఏమీ చేయలేను కదా? ఏం చేస్తాం మాకా అదృష్టం లేదు, దానికి ఎక్కడ రాసిపెట్టి వుంటే అక్కడికి వెళుతుంది" అని చాలా నిరాశతో అన్నారు.

"అదేమిటి పిన్ని, బాబయ్య ఇంత మంకుపట్టు పట్టారు. ఈ వ్యవహారం ఇంత జటిలమవుతుందని మేము కలలో కూడా అనుకోలేదు. అక్కడ మా మావగారు, అత్తగారు ఎంతో ఆతృతగా శుభవార్త కోసం ఎదురు చూస్తున్నారు, మోహన్ కూడా ఎంతో ఆశతో వున్నాడు, వారికి ఏం చెప్పాలో మాకు తోచడం లేదు. పోని బాబయ్యతో ఒంటరిగా మాట్లాడి ఆయనకి వున్న అపోహలు, సందేహాలు నివృత్తి చేసి ఒప్పించడానికి ప్రయత్నిస్తాను" అన్నాడు సత్యనారాయణ.

"వద్దురా ఇందాకా ఆయన మాట తీరు చూసావుకదా, మనమందరం నచ్చచెప్పడానికి ప్రయత్నం చేస్తున్నకొద్దీ ఆయనకి అసహనం పెరిగి మరింత బిగుసుకు పోతున్నారు. ఇంక ఈ విషయం ఎవ్వరూ మాట్లాడవద్దని కోపంతో బయటికి వెళ్ళారు. ఎల్లుండి అనూ కూడా తిరుపతి నుండి తిరిగి వస్తుంది, అది వచ్చాక విషయం తెలిసి ఇంకేమి రభస జరుగుతుందో చూడాలి. అందుకని సమయం చూసి మాట్లాడి ఒప్పించడానికి ప్రయత్నిస్తాను" అన్నారు పార్వతమ్మగారు.

"అలాగే పిన్ని, రేపు ఉదయాన్నే బయలుదేరి మేము మామయ్య ఇంటికి వెళతాము, అక్కడే భోజనం చేసి అలా గోదావరి ఎక్కేస్తాము" అన్నాడు సత్యనారాయణ.

"ఏరా మీ బాబయ్య మాటలకి కోపం వచ్చి వెళిపోతున్నారా?" నిష్టూరంగా అన్నారు పార్వతమ్మ గారు.

"అబ్బే అలాంటిదేమీ లేదు అత్తయ్యగారు, ఈ మధ్య బాబయ్యగారికి కాలు ఆపరేషన్ అయింది కదా ఒక సారి చూసి వెళదామని ముందే అనుకున్నాము" అంది వైదేహి.

"సరే అలాగే చెయ్యి. విశాఖ తిరిగి వచ్చినాక నరసింహారావుగారికి, సుబ్బలక్ష్మిగారికి హైదరాబాదులో జరిగిన చర్చలని విపులంగా చెప్పారు సత్యనారాయణ, వైదేహి. అది విన్న ఆ దంపతులిద్దరూ చాలా నిరుత్సాహ పడ్డారు, ఈ పరిణామం తమ కొడుకు మీద ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందా అని కలత చెందారు. విశ్వనాథంగారు ఈ పెళ్ళికి ఇక ఒప్పుకుంటాడన్న ఆశ వారికి పూర్తిగా పోయింది. ఆ రాత్రి కృష్ణమోహన్ ఫోన్ చేసి మాట్లాడాడు. సత్యనారాయణ, వైదేహి విషయాన్ని వివరంగా చెప్పారు. అది విన్న కృష్ణమోహన్

హతాశుడయ్యాడు, తన ఆశల సౌధాన్ని కూల్చి వేసినట్లు బాధ పడ్డాడు. నరసింహారావుగారు, సుబ్బలక్ష్మిగారు చాలాసేపు మాట్లాడి నిరుత్సాహపడద్దు, హైదరాబాదు వచ్చిన వెంటనే ఒకసారి ఇక్కడకు రా మాట్లాడు కుందాము పరిష్కార మార్గాన్ని వెదుకుదాము అని కొడుకుకి ధైర్యం చెప్పారు.

అనూరాధ తిరుపతి నుండి సోమవారం తిరిగి వచ్చాక జరిగినదంతా చెప్పాడు రవి ... తనను ఒక్కసారి కొండ మీద నుండి అగాధంలోకి తోసినట్లు, తన హృదయాన్ని ఎవరో పిండేసినట్లు బాధ పడింది అనూరాధ. తన గదిలోకి వెళ్ళి ఏడుస్తూ కూర్చుంది. రాజేశ్వరరావు, కవిత, రవి, పార్వతమ్మగారు వచ్చి చాలాసేపు ఓదార్చారు, అయినా అనూరాధ దుఃఖం ఆగలేదు. ఇంత జరుగుతున్నా విశ్వనాధంగారు పైకి వచ్చి అనూరాధని అనునయించలేదు. ఆ రాత్రికి పార్వతమ్మగారు అనూరాధ దగ్గరే పడుకొని బ్రతిమాలి, బ్రతిమాలి రెండు ముద్దలు తినిపించారు.

ఉదయాన్నే విశ్వనాధంగారు పార్వతమ్మగారితో పాటు అనూరాధ దగ్గరకి వచ్చి "తల్లిగాడు ఊరుకో ఏడవకు, నేను నీ కన్నతండ్రిని, నువ్వు ఎప్పుడూ సుఖసంతోషాలతో వుండాలని కోరుకొనే వాళ్ళలో నేను మొదటి వాడిని, అందుకని నేను ఏది చేసినా నీ మంచి కోరే చేస్తాను. నేను ఎంతో ఆలోచించి ఇటువంటి నిర్ణయం తీసుకున్నాను,



నీ బాధని నేను అర్థం చేసుకోగలను...గోత్రాల విషయమంతా వివరంగా చెప్పి సగోత్రీకులు, ఋషులు కలిసిన గోత్రాల వారు ఎందుకు వివాహం చేసుకోకూడదో, చేసుకుంటే జరిగే నష్టాల గురించి విపులంగా చెప్పి అనూరాధకి నచ్చచెప్పడానికి చాలా ప్రయత్నించారు విశ్వనాధం గారు. అయితే ఆయన మాట్లాడు తున్నంత సేపు అనూరాధ ఏడుస్తూనే వుంది.

"బావకి ఏం తక్కువయ్యింది నాన్నగారు, అందంగా లేడా? చదువు లేదా? ఉద్యోగం లేదా? ఐదు ఏళ్ళ బట్టి చూస్తున్నాము, మృదు భాషి, ఎంతో పద్ధతిగల మనిషి, తను నమ్మిన సిద్ధాంతాలకి కట్టుబడిన మనిషి, పరోపకార బుద్ధి వున్నవాడు, మంచి సంస్కారం వున్నవాడు, పెద్దలయందు భక్తి, గౌరవం వున్నవాడు, అన్నిటికీ మించి నా పట్ల ప్రేమాభిమానాలు మెండుగా వుండి నన్ను ప్రేమించినవాడు. అలాంటిది అతనిని వద్దనడానికి మీరు చెబుతున్న కారణాలు హేతుబద్ధంగా లేవు, మా పెళ్ళి ఎలాగైనా ఆపాలని ఏదో కుంటి సాకులు చెబుతున్నట్లు వుంది. మీరు చెబుతున్న కారణాలు కాకుండా మీ మనసులో ఇంకేదో కారణం వున్నట్లు నాకు అనిపిస్తున్నాది" అని తన ఆవేదనని వ్యక్తం చేసింది అనూరాధ.

అనూరాధ అడిగిన ప్రశ్నలకి ఏం సమాధానం చెప్పాలో తెలియక విశ్వనాధంగారు సతమతమయ్యారు. అప్పుడు...నేను బ్రాహ్మణ జన్మ ఎత్తినందుకు మన సాంప్రదాయాలని, ఆచార వ్యవహారాలని ఎంతో గౌరవిస్తాను, వాటిని త్రికరణ శుద్ధిగా ఆచరిస్తాను. ఉదయాన్నే లేచి కాలకృత్యాల తరువాత మడిగా పూజ చేసుకుని, భగవంతునికి నైవేద్యం పెట్టుకుంటే గాని నేను ఏమీ తినను, త్రాగను, నియమ నిష్ఠలతో వుంటాను. కానీ ఆ నరశింహారావుగారి కుటుంబంలో ఆచార వ్యవహారాలకి పెద్దగా ప్రాముఖ్యత లేదు, ఆయనగాని, మోహన్గాని పూజా పునస్కారాలు చెయ్యరు. వీటన్నిటికన్నా ముఖ్యమైన విషయం...సత్యం పెళ్ళిలో జరిగిన రచ్చకి నా మీద కక్ష గట్టి నిన్ను ఆ ఇంటి కోడలిగా చేసుకొని, నిన్ను ఆఱడి పెట్టి సాధించి నా మీద ప్రతీకారం తీర్చుకొందామని అనుకుంటున్నారు. వాళ్ళంతా కలిసి పన్నిన పన్నాగం ఇది, ఇందులో సత్యం కూడా పాత్రధారి, అందుకే ఆ ఇంట్లో నా పిల్లని ఇవ్వను. నీకు ఇంతకంటే

మంచి సంబంధం చూసాను, సుబ్రమణ్యం బాబయ్య భార్య అలివేలు మేనత్తగారి మనుమడు ఎం.ఎస్సి. చదివి ఇక్కడే మెహబూబ్ కాలేజీలో లెక్చరర్ గా చేస్తున్నాడు. వాళ్ళది ఆత్రేయ

పురం, మంచి సాంప్రయదాయ మైన కుటుంబం. అతనికి ఒక అక్కయ్య వుంది ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది, భాద్యతలు ఏమీ లేవు. ఆత్రేయపురంలో వాళ్ళకి ఇల్లు, భూములు, కొబ్బరి తోటలు వున్నాయి, ఇక్కడ కూడా విజయనగర్ కాలనీలో ఇల్లు వుంది. తల్లి తండ్రి ప్రస్థుతం ఇక్కడ వున్నారు గాని ఈ కుర్రాడి పెళ్ళి తరువాత ఆత్రేయపురంలోనే వుంటారు, చాలా మంచి వారు. కుర్రాడికి బదిలీలు అవి వుండవని, ఒకవేళ మారినా హైదరాబాదులోనే ఉంకో కాలేజికి మారుతాడని సుబ్రమణ్యం చెప్పాడు" అని కూతురికి నచ్చ చెప్పడానికి ప్రయత్నించారు విశ్వ నాథంగారు.

అన్నీ విన్నాక కూడా అనూరాధ తను కృష్ణమోహన్నే వివాహం చేసుకుంటాను, ఇంకెవరినీ చేసు కోను అని కరాకండిగా చెప్పింది.

అది విన్నవిశ్వనాథంగారు "చూడు అనూ నిన్ను కని పెంచి, నీ జీవితం సుఖమయంగా వుండాలని ఎన్నో ఆశలు పెట్టుకొని జీవిస్తున్న తల్లితండ్రులము మేము. ఎంతో అల్లారు ముద్దుగా, కష్టం తెలియనీయకుండా, ఏ లోటు రానీయకుండా నిన్ను పెంచాము. నీ మీద మాకున్న అపరిమితమైన ప్రేమాభిమానాలతో నీ సుఖ సం తోషాలని చూసి ఆనందిద్దామని, నీకు ఈ వూరిలోనే స్థిరంగా వుండే అబ్బాయిని ఇచ్చి వివాహం చేద్దామని అనుకుంటున్నాము. నువ్వు ఈ వూళ్ళోనే వుంటే నిన్ను ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకోవచ్చుననన్న నా ఆశ కూడా నెరవేరుతుంది. నిన్ను వదిలి నేను వుండలేనమ్మా, అది నా బలహీనత. తల్లి తండ్రులుగా మేము అలా కోరుకోవడం తప్పా? నీ వివాహ విషయంలో ఆ మాత్రం నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ, అధికారాలు మాకు లేవా? ప్రేమించుకోవడమనేది ఇద్దరు వ్యక్తులకి సంబంధించిన విషయం, పెళ్ళి అనేది రెండు కుటుంబాల కలయిక. భవిష్యత్తులో అందరూ సుఖ సంతోషాలతో వుండాలంటే ఆ రెండు కుటుంబాలకి ఆ వివాహం ఆమోదయోగ్యమైనదై వుండాలి, అలా కాకపోతే జీవితం దుర్భరం అవుతుంది. పొరపాటున నువ్వు మమ్మల్ని ధిక్కరించి నీ స్వార్ధం చూసుకొని మొహన్ని పెళ్ళి చేసుకొని వెళితే, ఆ ప్రభావం ఈ కుటుంబం మీద ఎంతగా వుంటుందో నీకు అర్ధం కావడం లేదు? రేపు నీ చెల్లెలి వివాహానికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయి, నువ్వు చేసిన పనికి అది శిక్ష అనుభవించాల్సి వస్తుంది" అని సానుభూతి అస్త్రాన్ని ప్రయోగించారు

"వాణి వివాహానికి ఇబ్బంది ఎందుకవుతుంది నాన్నగారు? నేను అన్య కులస్తుడినో, అన్య మతస్థుడునో వివాహం చేసుకోవడం లేదు. మన కులస్తుడినే, అందులో మన శాఖ వాడినే, మన బంధువుల అబ్బాయినే చేసుకుందాము అనుకుంటున్నాను, ఇందులో నేను చేస్తున్న తప్పు ఏమిటి?" అని నిలదీసింది అనూరాధ.

అంతవరకు మౌనంగా వున్న పార్వతమ్మగారు కూతురిని సమ-ర్ధిస్తూ "అది మాట్లాడినదానిలో తప్పు ఏమైనా వుందా? అది అడిగిన ప్రశ్నలకి మీ దగ్గర సమాధానం వుందా? ఎందుకండి లేని సమస్యని సృష్టిస్తారు? గోత్రాల విషయంలో ఇబ్బంది వుంది నేను కాదనను, కాని దానికి పరిష్కార మార్గం కూడా వుంది. మోహన్ తల్లితండ్రులే ఆ పరిష్కార మార్గాన్ని సూచిం చారంటే వాళ్ళకి మనతో సంబంధం కలుపుకోవడానికి ఎటువంటి అభ్యంతరము లేదని స్పష్టమవుతున్నాది.

ఇకపోతే మోహన్ది అఖిల భారత సర్వీసు గనుక అతను తన తల్లితండ్రుల దగ్గర వుండ చ్చు వుండకపోవచ్చు, వున్నా బదిలీల వల్ల కొంత కాలమే. ఆ మాత్రం దానికి వాళ్ళు అనూని ఆఅడి పెడతారని మీరు ఊహించుకోవడంలో అర్ధంలేదు. మీరు తప్ప మన ఇంటిల్లిపాది సుముఖంగా వున్నాము, మీరొక్క రే వ్యతిరేకిస్తున్నారు. ఇంతమంది కి ఇష్టమైనా మీ మొండి పట్టుదల ఏమిటో అర్ధం కావడం లేదు? పిల్లలు ఒకరంటే ఒకరు ఇష్టపడుతున్నారు వాళ్ళకి వివా హం చేస్తే వాళ్ళు సంతోషంగా, ఆనందంగా వుంటారు. వారి ఆనందం మన ఆనందం కాదా? వాళ్ళ ఆనందమే కదా మనం

కోరుకునేది, అలాంటప్పుడు వాళ్ళని విడదీసి మీరు ఏమి సాధిస్తారు? రేపు ఏదైనా జరగ కూడనిది జరిగితే మనం జీవి తాంతం బాధ పడాలి. మన పెళ్ళి అయిన తరువాత నేను ఎప్పుడూ మీ మాటే నా మాటగా నడుచుకున్నాను, అలాగే నేను ఎప్పుడూ మిమ్మల్ని ఏదీ అడగలేదు,దయచేసి లేనిపోనివి ఊహించుకొని భయపడి అడ్డం చెప్పకండి. ఈ ఒక్కసారి నా మాట వినండి" అని కాస్త కటువుగానే చెప్పారు.

ఇవన్నీ విన్న విశ్వనాథం గారు విపరీతమైన ఒత్తిడికి గురి అయి, కోపోద్రిక్తుడయి సహనాన్ని కోల్పోయి ..."నోరు ముయ్యండి, మీకు చెబితే అర్థం కాదా? నా పిల్లని ఆ కుటుంబంలో వెయ్యను. నా ఇష్టానికి వ్యతిరేకంగా అది ఇంట్లోంచి పారిపోయి మోహన్ని పెళ్ళి చేసుకుంటే నేను జీవితంలో ఇక దాని ముఖం చూడను, దానికి ఈ ఇంటితో సంబంధం పూర్తిగా తెగిపోతుంది. మీలో ఎవరూ దానితో మాట్లాడ్డానికి వీల్లేదు, ఒక వేళ మాట్లాడితే వాళ్ళకి కూడా ఈ ఇంట్లో స్థానం వుండదు. మీరందరూ కలిసి నన్ను మాయ చేసి దాని పెళ్ళి మోహన్తో చేస్తే ఈ ఇంట్లో నేను ఒక్క క్షణం కూడా వుండను...ఇవాళ మంగళవారం, మీకు శుక్రవారం దాకా సమయం ఇస్తున్నాను ఆలోచించుకోండి, శనివారం అనూని చూడటానికి పెళ్ళివారు వస్తున్నారు, ఈ లోపల దానిని ఒప్పించండి లేదా నా నిర్ణయానికి నేను కట్టుబడి వుంటాను" అని హెచ్చరించారు.

విశ్వనాథంగారి మాటలు విన్న అనూరాధ హృదయం పగిలేలా ఏడ్చింది. పార్వతమ్మగారు కూతురుని ఓదారుస్తూ "అమ్మా అనూ ఏడవకు, నీ బాధని నేను అర్థం చేసుకున్నాను గాని నీకు ఏ రకంగాను సహాయం చేయలేని స్థితిలో ఉన్నాను. అనూ మనం అనుకున్నవి అనుకున్నట్లు అన్ని జరగవు, అదే జీవితమంటే. అనుకున్నవి జరగనపుడే మనము మన మనోస్థైర్యాన్ని కోల్పోకూడదు, నిబ్బరంగా వుండాలి, పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోవాలి. భగవంతుడు మనకి రాసిపెట్టి వుంటే జరిగేదానిని ఎవ్వరూ ఆపలేరు. జీవితం అన్నాక కష్టసుఖాలు, చీకటి వెలుగులు వుంటాయి. సంతోషం కలిగినపుడు పొంగిపోకూడదు, దుఃఖం కలిగినపుడు కృంగి పోకూడదు, సమతులితముగా వుండాలి. సానుకూలంగా లేనపుడు పరిస్థితితో రాజీ పడాలి...ఒకవేళ నువ్వు మీ నాన్నగారి మాట కాదని మోహన్ని పెళ్ళి చేసుకుని వెళితే మేము ఎలాగు నిన్ను కలవడానికి అవదు, దానికి జీవితాంతం మేము దుఃఖిస్తూనే వుంటాము. నువ్వు కోరుకున్న వ్యక్తితో వివాహం చేసుకొని వెళ్ళినంత మాత్రాన మమ్మల్ని మరిచిపోయి నువ్వు సుఖంగా వుండగలవా? కొత్తలో కొన్నాళ్ళు వుండగలవేమో గాని, తల్లి తండ్రులని, అన్నదమ్ములని, తోబుట్టువుని మరచిపోయి శాశ్వతంగా వుండలేవు. ఎందుకంటే మాతో నీకున్న అనుబంధం ఇరవై రెండేళ్ళది, మోహన్తో ఒక ఐదు సంవత్సరాల పరిచయం మాత్రమే. ఈ లోకం నువ్వు నీ స్వార్థం చూసుకున్నావని నిన్ను వేలెత్తి చూపుతుంది అందుకని కొంతకాలం తరువాత నీకు తప్పు చేసానేమో అనే భావన కలుగుతుంది, దాని వల్ల నీకు అశాంతి మొదలవుతుంది, అప్పుడు ఎవ్వరు చేయగలిగేది ఏమి వుండదు. నువ్వు చదువుకున్నదానివి, తెలివైన దానివి, జాగ్రత్తగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకో, నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అంగీకారమే" అని అనూరాధకి నచ్చచెప్పే ప్రయత్నాలు చేసింది పార్వతమ్మ గారు.

సాయంత్రానికి కాస్త తేరు కుంది అనూరాధ. "కలిసి మాట్లాడుదామంటే సమయానికి కృష్ణ వూర్లోలేడు, అతనికి విషయం తెలిసిందో లేదో? తెలిస్తే అతను ఏమని ఆలోచిస్తున్నాడు? ఒక వేళ తెలియకపోతే అతనికి ఎలా కబురు చేరవేయటం? కృష్ణకి తెలియదేమో, తెలిస్తే ఫోన్ చేసి వుండేవాడు. అతనితో ఒక్కసారి మాట్లాడితే తన ఆవేదన కాస్త తీరవచ్చునేమో? రేపు సత్యం అన్నయ్యతో మాట్లాడి కృష్ణ ఫోన్ నంబర్ వుందేమో అడగాలి. నాన్నగారు కృష్ణని కాకినాడలో ఎంతో దగ్గరగా చూసారు, అతని మంచితనము గురించి తెలిసి కూడా నాన్నగారు ఎందుకిలా మొండిగా ప్రవర్తిస్తున్నారు?

(ఇంకా ఉంది)

# కారణ జన్ముడు - గాన గంధర్వుడు బాలు



పోడూరి శ్రీనివాసరావు

అందరూ ముద్దుగా "బాలు" అని పిలుచుకునే శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం) ఇక లేడన్న వార్త ఆశనిపాతంలా సోకింది. చిన్న బాలుడి దగ్గరనుంచి వృద్ధులవరకు, స్వంత కుటుంబ సభ్యునిగా ప్రతీఒక్కరు భావించే గాన గంధర్వుడు బాలు అమరుడైనాడన్న వార్త యావత్ ప్రపంచాన్ని కుదిపేసింది. ఈ చేదు నిజాన్ని ప్రపంచం జీర్ణించుకోలేకపోతోంది. ఎందుకయ్యా మాతో ఇంత అనుబంధాన్ని పెనవేసుకున్నావు ? ... మాలో ఒకడివైపోయావు ?? ..... కేవలం నీ పాటలను ఆస్వాదించడం తప్ప, నీకు మేము ఏం బదులివ్వగలిగాం చెప్పు.

బాలు మేరునగధీరుడు... నేను ఏ గురువు వద్ద శాస్త్రీయసంగీతం నేర్చుకోలేదు అని చెబుతూనే, అద్భుతమైన మాధుర్యభరిత, రాగభరిత, సుమనోహర గీతాలను మనకందించాడు. ఎన్నో భక్తిగీతాలు, ప్రబోధగీతాలు, ప్రణయగీతాలు, యుగళగీతాలు.... ఈటీవీలో సుమారు 22 సంవత్సరాల క్రితం, 1998 లో పురుడుపోసుకున్న సంగీత కార్యక్రమం ""పాడుతా తీయగా"". " పాడాలని వుంది ", "పాడుతా తీయగా" కార్యక్రమాల ద్వారా ఎందరో నూతన గాయనీ గాయకులను తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అందించడమే కాదు. తెలుగు సినీ సంగీత సాహిత్యాలకు వారధిగా నిలవడమే కాదు. భాషతో ముడివడిన అపురూప సంగీతంతోపాటు సంస్కారాన్ని, సంస్కృతిని నేర్పించింది. వర్ధమాన గాయనీగాయకులకు తెలుగు భాషపట్ల అవగాహన, ఆసక్తి కలిగించింది. అక్షరదోషాలు పలకకుండా, తెలుగు భాష ప్రాభవాన్ని, గొప్పతనాన్ని ఆ చిన్నారులకు అర్థమయ్యేరీతిలో వివరించావు. తెలుగుభాష అంటే నీకెంత మక్కువయ్యా బాలూ !

ప్రస్తుతం సినీ సంగీతప్రపంచంలో రాణిస్తున్న కారుణ్య, స్మిత, హేమచంద్ర, దామిని, లిప్సిక, రోహిత్, తేజస్విని, ప్రవీణ్ పల్లవి, శ్రీకృష్ణ, పార్థసారథి, రామాచారి, కౌసల్య, సాయి చరణ్ ఈ వేదిక ద్వారా వికసించిన గొంతుకలే. అలాగే గోపికా పూర్ణిమ, మల్లిఖార్జున, ధనంజయ, నిత్య సంతోషిణి, హిమబిందు, శశికళ, బి. సురేఖామూర్తి, మౌనిమ, మనీషా, లక్ష్మీ మేఘన, సాయి రమ్య, శ్రీ లలిత, నాదప్రియ, సుగంధిని తదితర నేపథ్య గాయనీగాయకులంతా ఈ అపురూప సంగీతకార్యక్రమం నుంచి వెలుగులీనిన స్వర కాంతిపుంజాలే.

అదేవిధంగా "స్వరాభిషేకం" కార్యక్రమం ద్వారా గూడా వివిధ సంగీత దర్శకుల, రచయితల పాటలను తీసుకుని, అద్భుత విశ్లేషణతో గొప్ప గొప్ప పాటలను శ్రోతలకు అందించాడు బాలు.

1965 డిసెంబర్ 15 న ప్రారంభమైన బాలు సినీ గాన ప్రస్తానం అప్రతిహతంగా 2020 వరకు, అంటే అయిదున్నర దశాభ్దాలపాటుసాగడమేకాకుండా, నలభై వేల పాటలకు పైగా పాటలు పదహారు భాషల్లో పాడిన అసామాన్య, అనితరసాధ్యమైన ఘనత మన బాలుది.

// 02 //

గాయకుడుగా, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా, సంగీతదర్శకుడిగా బహుముఖ ప్రతిభ కనపరచిన ఘనుడీ బాలు. ఎంతో బిజీ గా వున్నా సమయాల్లో కూడా ఉదయం 7 గంటలనుంచి 9 గంటలవరకు పాటల రికార్డింగ్ లోను, 9 గంటలనుంచి సాయంత్రం 6 గంటలవరకు చిత్రీకరణ లోను పాల్గొనేవారు. మధ్యలో గంట విరామం తీసుకునేవారు. సాయంత్రం 6 గంటలనుంచి రాత్రి 10 గంటలవరకు మళ్ళీ రికార్డింగ్. కన్నడ సంగీత దర్శకుడు ఉపేంద్ర కుమార్ సంగీత దర్శకత్వంలో ఒకేరోజు 21

పాటలు పాడి రికార్డ్ సృష్టించారు. అలాగే తమిళంలో ఒకేరోజు 19 పాటలు, హిందీలో 16 పాటలు ఏకబిగిన పాడి రికార్డ్ సృష్టించారు. హిందీ సంగీత దర్శకుడు ఆనంద్ మిలింద్ కు 15 నుంచి 20 పాటలు ఒకేరోజు పాడి మద్రాస్ తిరిగివచ్చిన సందర్భాలు కూడా వున్నాయి.

కమల్ హసన్ కు డబ్బింగ్ కళాకారుడిగా 'మన్మథలీల' చిత్రంతో తన ప్రస్తానం ప్రారంభించిన బాలు కమల్ హసన్, రజనీకాంత్, భాగ్యరాజ్, నగేష్, కార్తీక్, రఘువరన్, సల్మాన్ ఖాన్, అనిల్ కపూర్ లాంటి నటులకు డబ్బింగ్ చెప్పారు. 'దశావతారం' చిత్రంలో, కమలహాసన్ నటించిన వివిధ పాత్రలకు వైవిధ్యభరితంగా సంభాషణలు పలికిన తీరు మరో కళాకారునికి అనితరసాధ్యం. 'అన్నమయ్య', 'శ్రీ సాయి మహిమ' చిత్రాల్లో డబ్బింగ్ చెప్పినందుకు బాలు ఉత్తమ డబ్బింగ్ కళాకారుడిగా నంది బహుమతులు గెలుచుకున్నారు. రిచర్డ్ అటెన్ బరో నిర్మించిన 'గాంధీ' చిత్ర తెలుగు వెర్షన్ లో గాంధీ పాత్రధారి బెన్ కింగ్స్ లే కు గాత్రదానం చేసింది బాలునే.

'కన్యాకుమారి' చిత్రానికి తొలుత సంగీత దర్శకత్వం వహించిన బాలు 30 తెలుగు చిత్రాలకు స్వరాలు సమకూర్చారు. హిందీ, తమిళం, కన్నడ భాషల్లో కలిపి మొత్తం 60 చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు మన బాలు.

ఉత్తమ గాయకుడిగా బాలు 6 జాతీయ బహుమతులు అందుకున్నారు. 3 సార్లు తెలుగు పాటలకు, ఒక హిందీ పాటకు, ఒక తమిళ పాటకు, ఒక కన్నడ పాటకు, మొత్తం 6 సార్లు జాతీయ పురస్కారాలు అందుకున్నాడు.

బాలు. జాతీయ స్థాయిలో ఉత్తమగాయకుడిగా 'మైనే ప్యార్ కియా' చిత్రానికి, దక్షిణ భారతీయ భాషల్లో ఉత్తమ గాయకుడిగా 7 సార్లు ఫిలిం ఫేర్ అవార్డులు గెలుచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తమ గాయకుడిగా 18 సార్లు, 'మయూరి' చిత్రానికి ఉత్తమ సంగీత దర్శకుడిగాను 'నంది పురస్కారాలు' అందుకున్నారు. 'మిథునం' సినిమాలో నటనకు ప్రత్యేక జ్యూరి బహుమతి లభించింది. తమిళ చిత్రాల్లో ఆలపించిన పాటలకు 4 సార్లు, కన్నడ సినిమాల్లో పాడిన పాటలకు 3 సార్లు బహుమతులు గెలుచుకున్నారు బాలు. రాజలక్ష్మి ఫౌండేషన్, సుర్ సేన్, అక్కినేని, లతామంగేష్కర్ జాతీయ బహుమతులతో సహా లెక్కలేనన్ని పురస్కారాలకు బాలు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వం 2001 లో 'పద్మశ్రీ', 2011లో 'పద్మభూషణ్' పురస్కారాలతో బాలుని గౌరవించుకుంది.

// 03 //

ఏ నటుడుకి ఏ పాట పాడినా, ఏ భాషలో పాడినా వాళ్ళే పాడేరా ! అనిపించేలా మంత్రముగ్దులిని చేసిన స్వరజ్ఞాని. సాధారణంగా తండ్రీ కొడుకులకు ఒకే గాయకుడు పాడడం అరుదైన విషయం. అలాంటిది తాతమనవళ్ళకు పాడిన ఘనత బాలుది. సీనియర్ ఎన్టీఆర్, బాలకృష్ణ లతోపాటు జూనియర్ ఎన్టీఆర్కు పాడారు. ఏఎన్నార్ తోబాటు నాగార్జున కూ పాడారు. అల్లు రామలింగయ్యకు, అల్లు అర్జున్ కీ గూడా పాడారు. ఎన్టీఆర్ కు, ఏఎన్నార్ కు విభిన్న స్వరాలతో పాడి మెప్పించాడు.

5 యూనివర్సిటీలు బాలుకి గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసాయి. భారతదేశం లోనే కాదు.. యావత్ ప్రపంచం లో మరో బాలసుబ్రహ్మణ్యం పుట్టడుగాక పుట్టడు.


"కాస్త ప్రయత్నిస్తే బాలు నాలా పాడగలడు....కానీ మరో జన్మ ఎత్తినా, నేను బాలులా పాడలేను"...........ఇది మహానుభావుడు, సంగీత సరస్వతి, విద్వన్మణి శ్రీ మంగళంపల్లి బాలమురళికృష్ణ మన బాలుకి ఇచ్చిన కితాబు. ఈ ఒక్క ప్రశంస చాలు బాలు ప్రతిభను అంచనా వేయడానికి. అటువంటి గొప్ప కళాకారుని ప్రశంసలు, ఎందఱో సంగీత అభిమానుల గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించుకున్న బాలు అదృష్టవంతుడు కాక మరేమిటి ?

అంత గొప్ప కళాకారుడిని కోల్పోయిన మనం దురదృష్టవంతులం కాక మరేమిటి.

-డా. పోడూరి శ్రీనివాస్ రావు,
(98494 22239)

# గడి - నుడి

డా. చాగంటి కృష్ణకుమారి




## సూచనలు : అడ్డం:

1. పరమాణు భారాన్ని సంయోజకత తో భాగిస్తే వచ్చే విలువ (5)

3. భిన్నంలో కింది అంకె ను ఇలా అంటారు (3)

4. వంకరైన. (3)

5. సందడి చివరన వుంది నాగలి (5)

6. త్రాగే పాలు కావు, వినాల్సినవి (4)
8. నైరుతి దిక్కు లోని ఏనుగు పేరు (4)

10. ఏభై సెంటీ మీటర్లు ( 5)

11. ఘర్మ జలానికి ధర్మజలానికి ఖరీదు గట్టే ..... లేడోయ్.(3)

13. త్రాచు పాము చర్మపు సాగేగుణముతోపాటూ దాని --- కి మెత్తని వశ్యతా గుణము వుండడం వల్ల తనకంటే రెండుమూడు రెట్లు పెద్దదైన జంతువుని సైతం మింగ గలుగుతుంది (3)

14. త్రాసు కిరువైపులా ప్రేళాడ గట్టిన పళ్లేలకు సమంంతరంగా వుండే కర్ర ( 5) వెనకనుండి ముందికి

## సూచనలు : నిలువు:

1. సమానం ( 3)

2. జ్వరంతోనున్న వాని నోట్లో థర్మామీటరు పెడితే దానిలోని పాదరసం .... చెంది అతని జ్వరతీవ్రత ఎన్ని డిగ్రీలున్నదో చూపుతుంది.(4)( కిందనుడి పైకి )

3. నాగలికి ముందుచేర్చు; విషమవుతుంది (4)

7. కాచిన పాలపై కట్టే తెట్టు (5)

9. సువాసనలు వెదజల్లే దీని శాస్త్రీయనామం Origanum majorana అని ఎన్నటికీ మరచి-పోము(4)

12. ఒడంబడిక (3)

---

### సెప్టెంబర్ నెల గడి-నుడి సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| నొ | బి | లి | య | మ్ | | ట్లు | క్ర | ఇ |
| స | | జా | | య | | చె | | రి |
| ట | కో | | ప | రి | ధి | | పా | డి |
| | | అ | | ధో | | సు | | య |
| మ్ | ల | ట | టాం | | ఆ | స్మి | య | మ్ |
| య | | క | | స్కాం | | త | | |
| షి | దో | | ప | డి | శం | | పొ | ది |
| గ్నీ | | దా | | య | | ప | | మ్మ |
| మె | రు | పు | | మ్ | య | ని | ఫ్లూ | నె |

# తెలుగు పద్య రత్నాలు - 18

## ఆర్. శర్మ దంతుర్తి



ఈ మధ్య వార్తల్లో చదివిన విషయాల ప్రకారం హనుమంతుడి గురించి పెద్ద పెద్ద విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా చెప్తున్నారుట. ఎక్కడ ఎంతమాట్లాడాలో అంతే మాట్లాడ్డం, ఎవరితో ఎలా మాట్లాడాలో అలాగే మాట్లాడ్డం, మాట్లాడేటపుడు మధురంగా సంభాషించడం, అదే పనిగా మాట్లాడకుండానూ, మరీ నోరు కట్టేసుకోకుండానూ ఉండడం అనేవన్నీ. హనుమంతుడు లంకానగరంలో ఏమి, ఎలా చేసాడో, రాముణ్ణి మొదటిసారిగా కలిసినప్పుడూ, సీతా అమ్మవారిని లంకలో మొదటిసారి చూసినప్పుడూ, రావణుడితో సభలో ఎలా మాట్లాడాడో అవన్నీ ఉటంకిస్తూ చెపుతున్నారు – పాఠ్యాంశంగా. హనుమంతుడు మొదటిసారి రాముణ్ణి చూసాక మాట్లాడిన తీరువేరు, మొదటిసారిగా లంకలో దిగగానే లంఖిణితో మాట్లాడిన తీరు వేరు; అమ్మవారు ఇంక నాకు ఆత్మహత్య ఒకటే గతి అనుకుంటూ ప్రాణం తీసుకోబోతూన్నప్పుడు ఆవిడతో మాట్లాడిన తీరువేరు. ఇవన్నీ మామూలు మనుషులుగా మనందరం తప్పకుండా నేర్చుకోవాలి. మరి హనుమ ఎక్కడనేర్చుకున్నాడివన్నీ?

సూర్యుడి దగ్గిరకి వెళ్ళి హనుమ అడుగుతాడు తనకి చదువు నేర్పమని. 'నేనేమో నువ్వు అందుకోలేని వేగంతో తిరుగుతూ ఉంటే నీకు పాఠాలు చెప్పడం ఎలా కుదురుతుంది' అంటాడు సూర్యుడు. దానికి హనుమంతుడి సమాధానం ఏమంటే, 'ఓ కాలు ఉదయాద్రిమీదా, ఓ కాలు అస్తాద్రిమీదా వేసి సూర్యుడు ఎటువెళ్తే అటు వంగుతూ నేను మీ కూడా వస్తాను, మీ పాఠాలు మీరు కానివ్వండి, నేను నేర్చుకుంటాను' అని. అంతటి దీక్ష కలవాడు కనకే వేదవేదాంగాలు నేర్చుకుంటాడు. దీని అర్ధం ఏమంటే, ఎప్పుడైతే మనకి అటువంటి అకుంఠిత దీక్ష ఉందో అప్పుడు ఏదైనా సాధ్యమై తీరుతుంది. ఇప్పుడా హనుమంతుడు – ఇన్ని విద్యలు నేర్చుకున్నాడు కనక లంకకి వెళ్ళడానికి సమర్ధుడు. ఎక్కడ ఎవరితో ఏమి ఎలా మాట్లాడాలో తెల్సినవాడు కనక. ఈ నెల పద్యం రామాయణ కల్పవృక్షంలో విశ్వనాథ సత్యన్నారాయణగారిది. సుందరకాండకి ముందు జాంబవంతుడు హనుమని లంకకి వెళ్ళడానికి 'నీకన్నా సమర్ధుడెవరున్నారు, అలా ఏమీ తెలియనివాడిలా కూర్చున్నావేమిటయ్యా?' అంటూ పొగుడుతున్నప్పుడు హనుమ ఇచ్చిన సమాధానం.



ఉ. ఎంతటివాడు కావలయునెప్పుడు యత్ప్రతిభావిశిష్టుడై
యంతటివాడు నేనగుదునప్పుడు తత్ప్రతిభావిశిష్టుడై
యంతక ప్రాంగణస్థిత మహాధ్వజవద్భుజదండ తీవ్రుడన్
చింతిత కార్యముల్ తనరజేయగ గల్పతరూపమానుడన్

(రామాయణ కల్పవృక్షం. 439)

హనుమకి ఇచ్చిన శాపం వల్ల తన శక్తి ఎంతటిదో వేరే ఎవరో గుర్తు చేస్తే తప్ప తెలియదుట. అందువల్ల జాంబవంతుడు గుర్తు చేస్తాడు. అప్పుడు హనుమకి తన శక్తి తెల్సి వచ్చింది. తానేంటో ఏం చేయగలడో చెప్తున్నాడు. ఏ ప్రతిభతో ఎప్పుడు ఎలాంటి వాణ్ణి కావాలో (ఎంతటివాడు కావలయునెప్పుడు యత్ప్రతిభావిశిష్టుడై) అప్పుడు అంతటి ప్రతిభావంతుణ్ణి కాగలను (యంతటివాడు నేనగుదునప్పుడు తత్ప్రతిభావిశిష్టుడై). ఎప్పుడు ఎంతటి తీవ్రత కావాలిస్తే అప్పుడు అంతటి భుజదండ తీవ్రత చూపించగలను (యంతక ప్రాంగణస్థిత మహాధ్వజవద్భుజదండ తీవ్రుడన్). ఎటువంటి కార్యానైనా సరే చేయగలవాణ్ణి (చింతిత కార్యముల్ తనరజేయగ గల్పతరూపమానుడన్). ఇదంతా గొప్పలు చెప్పుకోవడం కాదు. తన శక్తి ఇదీ అని తెలియచెప్తున్నాడు. ఎందుకలా? ఎందుకంటే 'ఈ శతయోజన విస్తీర్ణమైన సాగరం లంఘించడానికి ఎవరికుంది బలం?' అన్నప్పుడు, ఒక్కొక్కరూ నేను పది, నేను ఇరవై, నేను ముప్పై యోజనాలు దూకగలను అంటూ వారి వారి శక్తి చెప్పినప్పుడు హనుమంతుడు చెప్తున్నడన్నమాట – ఇదీ నా ప్రతాపం అంటూ. ఇదంతా చెప్పాక తాను చెప్పినట్టూ 'చూసి రమ్మంటే కాల్చివచ్చినంతటి' ఘనుడు అంజనీ పుత్రుడు. ఆ దాటేది కూడా ఎలా దాటుతాడో చెప్తాడు – రాఘవుడి ధనుస్సులోంచి విడిచినబాణం ఎంతటి వేగంతో వెళ్తుందో అంతటి వేగంతో వెళ్లగలడుట.

ఇదంతా చెప్పాక లంకకి వెళ్ళడానికి సాగరం దాటుతుంటే ఈ చెప్పిన విషయాల ప్రకారం నిజంగానే హనుమంతుడు అంతటివాడా కాదా తెల్సుకోవడానికి దేవతలు సురస అనే నాగమాతని పిల్చి చెప్తారు 'ఈ హనుమంతుడు అసలు ఎంతటివాడో చూద్దాం దారి అడ్డగించు' అని. ఆవిడ అడ్డగించాక అతి సులభంగా శరీరం పెంచి ఒక్కసారి చిన్నగా అయ్యి బయటకి వచ్చి – అంటే అవిడతో యుద్ధం కూడా చేయకుండా, ఆవిణ్ణి బాధించకుండా – 'అమ్మా, నీనోట్లోకి వస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను, ఇంక నన్ను వెళ్లనియ్' అంటాడు. అలా ఎవరితో ఏమి మాట్లాడాలో ఎలా వ్యవహరించాలో తెలిసినవాడు కనకే రాముడు మొదటిసారి హనుమని చూసినపుడు తమతో ఎలా మాట్లాడాడో గమనించి లక్ష్మణుడితో అంటాడు,

సంస్కార క్రమ సంపన్నాం అద్భుతాం అవిలంబితాం
ఉఛ్చారయతి కల్యాణీం వాచం హృదయ హర్షిణీం

(వాల్మీకి రామాయణం 4-3-32)

మధురమైన వాక్కు; సరిగ్గా పలికే పదాలు; మరీ వేగంగానూ, మరీ నెమ్మదిగానూ కాని ఉఛ్చారణ, మాట్లాడేటపుడు చెప్పే విషయంలో నమ్మకం, చెప్పవల్సింది సరిగ్గా చెప్పడం; ఇటువంటి మంచి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంతటి వాడైనా మొత్తం రామాయణంలో ఎక్కడా కూడా హనుమంతుడు 'నేను ఇంత గొప్పవాణ్ణి' అంటూ ప్రగల్భాలు పలకడం కనిపించదు. ఆఖరికి రావణ సభలో అడుగుతారు 'ఎవరు నువ్వు, ఇక్కడకి ఎందుకొచ్చావు?' అంటూ. దానికి హనుమ ఇచ్చే సమాధానం ఏమంటే, 'జయత్యతి బలోరామో లక్ష్మణశ్చ మహాబలః' అంటూ మొదలుపెట్టి 'నేను వాళ్ల దూతని మాత్రమే సుమా' అంటూ చెప్పడం చూస్తే ఎంతటి వినయం కలవాడో తెలుస్తుంది. చివరకి రావణుడితో కూడా ఇదే చెప్తాడు – 'బ్రహ్మా స్వయంభూః చతురాననోవా, రుద్రః త్రినేత్ర త్రిపురాంతకోవా, ఇంద్రో మహేంద్ర స్సురనాయకోవా, త్రాతుం నశక్తాయుధి రామవర్యం.' తానెంతటి వాడైనా ముందు తన గురించి కాదు, రాముడి గురించి మాత్రమే చెప్పేది – బ్రహ్మ, రుద్ర మహేంద్రాదులతో సహా ఎవరూ రాముడి ముందు నిలవలేరు అని. అదే హనుమంతుడి వినయం.

# బొట్టూ బొట్టూ కలిసి



## ఆదూరి హైమవతి

స్కూల్ టైమైంది. పిలల్లంతా భుజాలకు బ్యాగులు తగిలించుకుని గబగబా నడుస్తూ వెళుతున్నారు. ఉన్నట్లుండి ఆగుంపులో నడుస్తున్న నరేష్ ఏదోవినిపించినట్లె ఆగిపోయాడు.

" ఏమైందిరా! అలా ఆగిపోయావ్ ?రా రా ! టై మవుతున్నది" అంటూ వెనక్కు చూశాడు శాయి. "ఒరే శాయీ ! నా బ్యాగ్ కూడా పట్టుకుని నడుస్తుండరా! నేను ఐదు నిముషాల్లో మిమ్మల్ని కలుస్తాను." అంటూ మెడకు తగుల్చుకుని ఉన్న స్కూల్ బ్యాగ్ తీసి శాయికి అందించాడు. "ఒరే నరేష్ పాస్ కెళ్ళాల్సి ఉంటే త్వరగా వెళ్ళిరారా! ఈ రోజు నుంచీ పరీక్షలు మొదలవు తున్నాయ్! లేటైతే సార్లు పరీక్ష రాయనివ్వరు.జల్దీ వచ్చేయ్ !" అంటూ తన గుపులో కల్సి ముందుకు సాగాడు శాయి.

అంతా స్కూల్ చేరారు. ఫస్ట్ బెల్లైంది.సెకండ్ బెల్లైంది. ఎంతకూ నరేష్ రాలేదు. శాయికి కంగారెక్కువైంది.హాజర్ కూడా తీసేసుకున్నారు సార్ గారు. తెల్లకాయితాలు ఇచ్చేశారు. మూడో బెల్ ఐంది. ప్రశ్నాపత్రాలు ఇవ్వ సాగారు. ఇంతలో వగర్చుకుంటూ వచ్చాడు నరేష్ . "మే ఐ కమిన్ సర్ !" అంటూ వినయంగా నమస్కరించాడు.

"ఏరా పరీక్ష రోజైనా త్వరగా రావాల్ని తెలీదా! హాజర్ పట్టీలో ఆబ్ సెంట్ పడింది. వెళ్ళి పెద్దసార్ గార్ని పర్మిషన్ తీసు కురా! అప్పుడే పరీక్షరాయనిచ్చేది."అంటూ ప్రశ్నాపత్రాలు పంచడంలో మునిగిపోయాడు సార్.

నరేష్ పెద్దసార్ ఆఫీస్ రూం ముందు కెళ్ళి నిల్చుని " మే ఐ కమిన్ సర్ " అని నమస్కరించాడు. ఆయన తలెత్తి నరేష్ ను చూసి " ఎస్ .ఏంకావాలి? " అని అడిగారు.

"సర్ ఆలస్యం గావచ్చాను ఇప్పుడే, పరీక్ష రాయాలంటే మీ పర్మిషన్ అడగమన్నారు సర్ గారు." అని మెల్లిగా చెప్పాడు . పెద్దసార్ తలెత్తి వాడికేసి చూశాడు.యూనిఫాం చొక్కా తడిసి ఉంది.ముఖం గాభరాగా ఉంది. ."ఏరా! ఏంచేశావు ఇంత సేపూనూ? సమయం తెలీలేదా? లేక పరీక్ష సంగతి మర్చిపోయి ఇంతసేపూ ఆడుకుంటూ ఇప్పుడు గుర్చొచ్చి వస్తున్నావా?" అని అడిగారు ఆగ్రహంతో. "లేదు సార్! నేను వచ్చేదార్లో ..."అంటూ వాడు జరిగిందంతా చెప్పాడు.ఆమాటలు వింటూ పెద్దసార్ తన కుర్చీలోంచీ లేచి వాడిదగ్గరగా వచ్చారు.

అంతావిన్నాక భుజంతట్టారు. " సరే పద "అంటూ వాడి తరగతి గది దగ్గరకు వచ్చా రు. ఆయన్ని చూసి గదిలో పరీక్ష నిర్వహిస్తున్న సార్ వచ్చారు." ఈ నరేష్ కు ప్రశ్నాపత్రం ఇవ్వండి, నేను హాజరు వేస్తాను. పరీక్షయ్యాక అంతా అసెంబ్లీ హాల్లో హాజరవండి. మాట్లాడాలి. నరేష్ వెళ్ళి పరీక్షరాయి." అని చెప్పి వెళ్ళిపోయారు.

పరీక్ష పూర్తైంది . అంతా భయభయంగా అసెంబ్లీ హాల్లో కొచ్చారు. పిల్లలకంతా భయంగానే ఉంది. పెద్ద సార్ ఏం కోప్పడతారో అని.

పెద్దసార్ వచ్చారు." పిల్లలూ! మీరంతా కూడా నరేష్ లాగా ఉండాలి. ఈరోజు వాడు పరీక్షకు ఎందుకు ఆలస్యంగా వచ్చాడో తెల్సి నేను ఆశ్చర్యపోయాను. మునిసిపాలిటీ వారు నీరు వీధి ట్యాప్స్ కు ఉదయం ఆరుకే వదులుతుంటారు . ఈరోజు ఆలస్యంగా వదిలారు. అప్పటికే నీటికోసం ట్యాప్స్ త్రిప్పేసి, నీరు రాకపోడంతో వాటి నలాగే వదిలేసి , నీరు వస్తే ఆ శబ్దానికి రావచ్చని ఎవరో వెళ్ళిపోయారు.నీరు వదలగానే ట్యాప్స్ లోంచీ నీరు క్రిందికి కారే శబ్దం నరేష్ విన్నాడు. వెంటనే ఒక బాధ్యతాయుత పౌరునిగా



తన స్కూల్ బ్యాగ్ స్నేహితునికి ఇచ్చేసి , అతడు వరుసగా తిప్పేసి ఉన్న పది ట్యాప్స్ ఆపేసుకుంటూ ఆకాలనీ అంతా తిరిగాడు . వాని యూనిఫాం షర్ట్ తడిసిపోయినా లెక్కచేయలేదు. అంతేకాక అక్కడ ఒక చెట్టుక్రింద పడి ఉన్న ఒక ముసలవ్వకు నీరు పట్టి దాహం తీర్చాడు.అక్కడే చెట్టుక్రింద దాహంతో నాలిక తెరుచుకుని స్పృహ లేక ఉన్న ఒక ఆవుకు నీరు పోసి కాపాడాడు. ప్రాణాధారమైన నీరు వృధా కానివ్వక పోడమే కాక ఆప్రాణాధారమైన నీరు తెచ్చి అందించి ఇరువురి ప్రాణాలు కాచాడు మన పన్నెండేళ్ళ నరేష్. ఇంత చిన్నవయస్సులో సమాజం పట్లా, తోటి జీవులపట్లా , ప్రకృతి సంపద పట్లా తన బాధ్యత తెల్సుకుని ప్రవర్తించాడు, ఇతడు మన బళ్ళో చదవడం మనకు గర్వకారణం. ఈ మండే వేసవిలో నీరు వృధాచేయడం నేరం. మన నరేష్ నీటి శబ్దం దూరం నుంచే విని గమనించి వెళ్ళి ఇలా సేవచేయడం నిజానికి ఒక మంచి పౌరుని బాధ్యత. నరేష్ ! నీకు ఇలా చేయాలని ఎందుకని అనిపించింది బాబూ!"అని అడిగారు పెద్దసార్. "సార్ ! నీటి బొట్టు విలువ నాకు బాగాతెల్సు. మా ఇంట్లో నీరులేక మేము ఒకే బకెట్ నీళ్ళతో తలా రెండు చెంబు లతో ఒళ్ళుతడుపుకుని స్నానం చేస్తాం .ఒక్కోమారు త్రాగను నీరులేక చాలా ఇబ్బంది పడుతుంటాం.మా అమ్మ 'ఎక్కడ కొళాయి నీరు పోతున్నా ఆపేసి వెళ్ళు బాబూ !' అని ,మానాయనగారు "నీరులేక ఎన్నో ప్రాణాలు పోతున్నాయ్ ,నీరు వృధా కానీయరాదు.'అని చెప్పారు. మా ఆంగ్ల ఉపాధ్యాయులు ఒక ఆంగ్ల-పద్యం చెప్పారు .దాని అర్ధం చిన్న నీటిబొట్లు , చిన్న ఇసుక రేణువులే బ్రహ్మాండమైన సముద్రంగా మారాయని.

**Little drops of water,**
**Little grains of sand,**
**Make the mighty ocean**
**And the pleasant land.**

- చిన్న నీటి బొట్టును కూడా వృధా చేయకూడదని మా సార్ చెప్పారు. అందుకని నేను తల్లి, తండ్రి, గురువులు చెప్పిన మాటలు దైవ వాఃక్కులుగా భావించి ఎక్కడ నీటి చుక్క వృధా అవుతున్నా చూస్తూ ఉండలేను. ఆ చిన్న నీటి చుక్కలన్నీ కలిసి చెరువుగా, నదిగా సముద్రం గా మారటం నాకళ్ళకు కనిపి స్తుంటుంది." అని చెప్పగానే అంతా కరతాళ ధ్వనులు చేసారు.

# మా ఊరి నందుల ఆత్మీయ కథ



## నందుల ప్రభాకర శాస్త్రి

(గత సంచిక తరువాయి)

### శాస్త్రవేత్త

మా ఊర్లో కోమటి వెంకటసుబ్బయ్య అంటే ఎవరికీ తెలియదు. 'శెట్టి' అంటేనే అందరికీ తెలుసు. దయ్యం పట్టిన బీబీని నిశితంగా గమనించి బీబీ కాదు మాట్లాడేది, 'దయ్యమే' అని నిరూపించాడు. ఈయన కూడా వైద్యుడే. మా ఊరిలో 'ఇండేషన్' అంటే ఇంజక్షను వేయగల ఏకైక వైద్యుడు. రకరకాలైన ఇంజక్షన్లతో ప్రయోగాలు చేస్తుంటాడు. ఎంతో పెద్ద జబ్బు చేస్తేగానీ 'ఇండేషన్' చేయించుకోరు. అది కూడా అతి బలవంతం మీద.

ఎవరికైనా పన్ను నొప్పి వచ్చినా, పిప్పిపళ్ళు వున్నా శెట్టి వైద్యమే. రామములక్కాయలను ఎండబెట్టి, వాటి విత్తనాలు సేకరించి వాటిని వెన్నలో కలిపి నిప్పులపై వేసి.... ఆ వచ్చే పొగను గొట్టం ద్వారా ఒక చెవిలోకి పంపి, మరో చెవిలో ఊదురు గొట్టంతో గాలి ఊదుతూ ఉంటాడు. అరగంట తర్వాత చూస్తే .... ఈ చెవిలోని గొట్టం ద్వారా పొగ పోయి పళ్ళలో వుండే పురుగులను చంపితే... ఆ చనిపోయిన పురుగులు గొట్టం గుండా పెనంలో పడతాయి. వాటిని చూపించి పంటినొప్పి పోయిందంటాడు.

దీపావళికి టపాకాయలు కాల్చినా వైరుధ్యముండేది. వింత టపాకాయలు తయారు చేసేవాడు. అల్లం రసం ఎందుకు వేడిని పుట్టిస్తుందోనని పరిశోధనలు చేసేవాడు. ఊరందరితో 'చతుర్లు' ఆడేవాడు. పెండ్లిళ్ళలో 'వసంతాలు' ఆడితే.... ఈయన చివరకు కడుగునీళ్ళను కూడా వసంతంగా వాడేవాడు.

ఈయన భార్య మంచి ఇల్లాలు. అయితే... ఆమెకు ఒకటే పిచ్చి. 'కాఫీ' పిచ్చి. రోజుకు రెండుసార్లయినా కాఫీ తాగాలి. అప్పటికి ఇప్పటికి ప్రతి ఇంటిలో భరించలేని అనవసరమైన ఖర్చు... కాఫీ ఖర్చు. శెట్టికి అసలు ఇష్టముండేది కాదు. ఈయనకు తెలియకుండా ఏదో ఒక విధంగా కాఫీ తాగేది. కాఫీ ఎట్లా వచ్చిందని అనుమానంతో విపరీతంగా కొట్టేవాడు. అయినా కాఫీ మానేది కాదు. అప్పుడు కాఫీ బిళ్ళలు ఉండేవి. కనీసం వాటి వాసనైనా చూసేది.

అమ్మ దగ్గరకు కాఫీ పొడి కొరకు వచ్చేది. ఆమె కాఫీకి పాలు, చక్కర అవసరం లేదు. మరిగే నీళ్ళలో కాఫీపొడి వేసే తాగేది. వీలైనంత వరకు అమ్మ ఇచ్చి పంపేది. ప్రతిదినం ఏదోఒక సాకుతో కొడుతూ ఉండేవాడు. రక్తం కారేది. మళ్ళీ వెంటనే మందులు, మాకులు ఇచ్చి దెబ్బలు మాన్పేవాడు. కొట్టేటప్పుడు ఎవరూ చూడకుండా



తలుపులు బిగించి కొట్టేవాడు. భరించినన్ని రోజులు భరించి ఒకరోజు తిరగబడింది. శెట్టిని కిందేసి మీద కూర్చుని కొట్టటం మొదలుపెట్టింది. అయితే బయటివాళ్ళకు తెలియకుండా 'సావు...నీయక్క' అంటూ గట్టిగా అరుస్తున్నాడు. తనే భార్యను కొడుతున్న భావన ఇతరులకు కలగాలని.

అసలేం జరుగుతుందో తెలుసుకోవాలని సుబ్బారాయుడు మిద్దె పైకెక్కి గవాక్షంలో నుంచి చూసి, అసలు విషయం అందరికీ చెప్పాడు. అప్పటి నుండి కొట్లాట మొదలు కాగానే శెట్టి భార్య తలుపుల దగ్గరకి వచ్చేది. శెట్టి మాత్రం తలుపులు తెరచుకుని బయటికి వచ్చి అరిచేవాడు.

ఎన్ని కొట్లాటలు జరిగినా అన్యోన్యంగానే వుండేవారు. సంతానాన్ని పెంచి పోషించుకున్నారు. శెట్టి భార్య కాఫీ మానేసి చాలా రోజులైంది. చనిపోవటానికి ముందురోజు అమ్మ దగ్గరకు వచ్చి మంచి కాఫీ ఇమ్మని అడిగి తాగి వెళ్ళిపోయింది.

వంటరివాడైన శెట్టి తన పరిశోధనలతో కాలం వెళ్ళబుచ్చాడు. పిల్లలు పెద్దలై చేతికి అందివచ్చేవరకు జీవిక సాగించాడు.

ఆ ఊరి ఆడపడుచులకు ఆపద్బాంధవి 'మంత్రసాని' కొండోల్ల చెన్నమ్మ. నెలలు నిండి ఆడపడుచులు ప్రసవానికి అమ్మగారింటికి వచ్చిన నాటినుంచి వారికి మనోధైర్యం చెప్తూ, సుఖప్రసవం అవుతుందని, పండంటి మగపిల్లాడు పుడతాడని, ఏ కష్టం రాకుండా తనే కాన్పు చేస్తానని ధైర్యం నూరిపోస్తూ మొదటి కాన్పుకు వచ్చిన వారిని సంసిద్ధం చేసేది. అన్నట్లుగానే ఆ సమయానికి దగ్గరుండి అన్ని పనులు చేసి, పురిటి పిల్లలకు స్నానం చేయించి, పది రోజులు సేవ చేసేది. తనదైన శైలిలో ప్రసవం చేయించేది.

ఒకటి రెండు సార్లు కష్టమైనా ప్రసవాల్ని సాహసంగా చేయించేది. మరీ కష్టమైనప్పుడు పోరుమామిళ్ల పెద్దాసుపత్రి (బోడెమ్మ ఆసుపత్రి)కి పంపేది. ఒకసారి సిద్దయ్య భార్య కాన్పు నాటికి చెన్నమ్మ లేకపోతే .... బోడెమ్మల ఆసుపత్రికి తీసుకెళ్తే ఒకరోజంతా కష్టపడ్డా ప్రసవం కాలేదు. తల్లీబిడ్డ చనిపోయారని మూటకట్టి ఇంటికి పంపారు. శవాన్ని జట్కా బండిలో వేసుకుని రాత్రిపూట బయలుదేరితే... సగం దూరం వచ్చేటప్పటికి తల్లి పెద్దగా కేక పెట్టితే... పుట్టిన పిల్ల ఏడ్పులు విని జట్కాబండి సాయిబు దయ్యమని పారిపోయాడు. చుట్టుపక్కలవాళ్ళు గమనించి ప్రసవం అయిందని చెప్పి ఇంటికి తెచ్చారు. ఈ పని అప్పుడప్పుడు ఊర్లలో కూడా చేస్తారు. బండిలో పండబెట్టి రాల్లదారిలో బండిని నడిపితే ... ఆ కుదుపులకు ప్రసవం అవుతుంది.

## రైతులు

ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ. ఈ రాష్ట్రంలో పల్లెటూరిలో పుట్టినవాడు రైతు కాకుండాపోడు. ప్రతి మనిషికీ కనీసమంటే రెండు ఎకరాల పంటపొలం వుండితీరుతుంది. కారణమేమంటే ప్రతి కులవృత్తి చేసేవారికి మాన్యాలు వుంటాయి. అగ్రహారీకులకు, పెద్దరైతులకు పొలాలు ఎక్కువే వుంటాయి. ఊర్లో వున్న దేవాలయానికి భక్తులు ఇచ్చిన ఆస్తులుంటాయి.

(ఇంకా ఉంది)







RNI No. TELTEL/2011/39497 OCTOBER 2020 POSTAL NO. HSE/1043/2017-19
Date of Publication: 1st October Date of Posting: 8th October



Published, Edited and Printed by T Shanti at Flat No. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad-500048. Phone 9490571297 email: teega51@gmail.com , www.chaitanyam.net, Printed at Planographers, 5-8-300, Chirag Ali Lane, Abids, Hyderabad-500001.